# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక

వార్త




## శ్రీవారి సారె ట్రయల్ రన్ విజయవంతం

తిరుచానూరు, నవంబర్ 6, ప్రభాత వార్త



రానున్న కార్తిక బ్రహ్మోత్సవాలలో 25వ తారీకు పంచమి తీర్థం సందర్భంగా శ్రీవారి నుండి అమ్మవారికి సారే తీసుకురావడం ఆనవాయితీ. ఇందులో భాగంగా గురువారం ఉదయం నిర్వహించిన శ్రీవారి సారేకు ట్రైల్ రన్ విజయవంతంగా ముగించారు. తిరుపతిలోని చెన్నారెడ్డి కాలనీలో గల వినాయక స్వామివారి ఆలయం నుండి శ్రీవారి సారె ఊరేగింపు ట్రయల్ రన్ మొదలైంది. అక్కడి నుండి ఏనుగుపై సారెను ఊరేగింపుగా తిరుచానూరులోని పసుపు మండపం వద్దకు చేరుకున్నారు. ఈ కార్యక్రమంలో తితిదే డెప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, వి.ఆర్ శాంతి, ఎస్ఇ మనోహర్, విజివో గిరిధర్, ఆలయ అర్చకులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## 21న తిరుమలేశుని సేవకు రాష్ట్రపతి ముర్ము

### -ఏర్పాట్లులో అధికారుల తలమునకలు

తిరుమల,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:



భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఈనెల 20వతేదీ తిరూచానూరు పద్మావతిఅమ్మవారిని, 21న శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఆమె రాకకోసం ఏర్పాట్లు పూర్తిస్థాయిలో పక్కాగా ఉండాలని, ఎక్కడా లోటు పాట్లు లేకుండా చూడాలని టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అధికారులకు సూచించారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లలో ప్రతి ఒక్కరూ బాధ్యతతో విధులు నిర్వహించాలని గురువారం తిరుమల పద్మావతివిశ్రాంతి భవనంలో టిటిడి సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, ఎస్వీబిసి సిఈఓ ఫణికుమార్‌నాయుడు, సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అదనపు ఎస్పీ రామకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విఎస్ఒలు ఎన్టీవిరామ్‌కుమార్, సురేంద్రతో కలసి అదనపు ఈఓవెంకయ్యచౌదరి సమీక్షించారు.

# కళత్తూరును కాటేసిన రాయల్‌చెరువు





### ఐదు గ్రామాలను ముంచేసిన వరద
### ప్రాణ హాని తప్ప అంతా గుల్ల
### అంతుపట్టని వరద: క్షణాల్లో దళిత వాడ ముంపు
### రాకపోకలు బంద్: పరుగులు తీసిన అధికారులు

కెవిబిపురం,నవంబర్ 6 ప్రభాతవార్త

తెల్లవారు జామున పల్లె నిద్రలేచింది. ఎవరి పనుల్లో వారు నిమగ్నమయ్యారు.పశుసంపద ఉన్న వారు మూగజీవాలను మేతకు తీసుకెళ్ళటానికి సిద్ధం అవుతున్నారు. రైతులు తమ పంటపొలాల్లో పనులకు సిద్ధమౌతుండగా హఠాత్తుగా రాయల్ చేరువుకు పడ్డ బొగడ గండిగా మారిందనే వార్త దావానలంలా పాకింది. చూస్తుండగానే వరద నీరు ముంచెత్తింది. ఒక్కసారిగా చెరువు గండి పెరిగి నీరు మొదట కళత్తూరు దళితవాడను ముంచేసింది. తేరుకునే లోపల ఇళ్ళలోకి నీరు జొరబడింది. జనం ప్రాణాలను కాపాడుకోవటానికి మిద్దెలమీదకు ఎక్కారు కానీ నోరులేని మూగజీవాలు నీటి ప్రవాహానికి బలి అవకతప్పలేదు. చూస్తుండగానే మట్టితో నిర్మించుకున్న ఇళ్ళు నేలకొరిగాయి. ద్విచక్రవాహాలు నీటి ప్రవాహంలో కొట్టుకుపోతున్నా అడ్డుకోలేని దుస్థితి చోటు చేసుకుంది. నీటి ప్రవాహంతో ఒక్కసారిగా కళత్తూరు దళిత వాడ మూగబోయింది. ఎవరున్నారో? ఎవరు కొట్టుకుపాయారో తెలియని అగమ్యగోచర పరిస్థితి చోటు చేసుకుంది.కళత్తూరుతో పాటు మహాదేవ పురం, పాత పాళెం, ఎస్‌ఎల్‌పురం కాలనీలు జలమయమయ్యాయి. రాకపోకలు స్థంభించాయి.

**పగలు జరిగింది కాబట్టి . . .**

ఈ సంఘటన పగలు జరిగింది కాబట్టి ప్రాణ నష్టం జరగలేదు.అదే రాత్రి అయితే ఐదు గ్రామాల్లో ఎంత ప్రాణ నష్టం జరిగేదో ఊహించలేమని వాపోతున్నారు.గత 50 సంవత్సరాలలో ఇలాంటి జలప్రళయం చూడలేదని గ్రామాల్లోని వృద్దులు చెబుతున్నారు. రాయలచెరువు నీటితో దళిత వాడ







నీటిలో తెప్పగా మారింది. కళత్తూరు మాత్రమే కాకుండా పాతపాళెం,ఒళ్ళూరు,కళత్తూరు గ్రామాలు చెరువు నీటితో జలమయమైంది.ఈ సంఘటనతో గ్రామాల్లో ప్రాణ నష్టం లేదు కానీ భారీ ఎత్తున ఆస్తి నష్టం చోటు చేసుకుంది.సంఘటన తెలిసిన వెంటనే జిల్లా ఎస్పి సుబ్బరాయుడు, శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. జన జీవనం పునరుద్దరణకు చర్యలు తీసుకున్నారు. విజయవాడలో ఉన్న కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్ హుటాహుటిన సాయంత్రానికి చేరుకున్నారు.అయితే చెరువుకు గండి పడి ఒక్కసారిగా కళత్తురు దళిత వాడ మీదకు నీళ్ళు రాగా ప్రజలు హాహాకారాలతో ప్రాణాలను కాపాడుకొవటానికి మిద్దెల మీద ఎక్కి ప్రాణాలు దక్కించుకున్నారు. కళ్ళెదుటే తమ పసు సంపద కొట్టుకుపోతుంటే తమ ద్వి చక్రవాహనాలు కొట్టుకుపోతుంటే నిస్సాహాయులుగా చూస్తూ మిన్నకున్నారు.ఇక నాలుగు గ్రామాల్లో వేసిన పంటలపై ఇసుక మేటలు వేస్తే దక్కించుకోలేని దయనీయ స్థితి చోటుచేసుకుంది.

**భారీ ఎత్తున పశుసంపద నష్టం: పంటలు ధ్వంసం**

కెవిబిపురం మండలంలోని రాయల్ చెరువుకు గండి పడటంతో చెరువులో నీరంతా సముద్రం పాలైంది. వేలాది మూగ జీవాలు నీటిలో కొట్టుకుపోయాయి. మేకలు,గోర్రెలు చనిపోయాయి. గెదెలు మృతి చెందాయి. ఇక గత నెల కురిసిన వర్షాలతో చెరువు నిండటంతో సుమారు 2500 ఎకరాల్లో వేసిన పంట నీట మునిగింది. ఇసుక మేటలు వేసింది. ఎట్టా తేరుకోవాలని ఐదు గ్రామాల ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. అధికారులు పునరావస కేంద్రాలు ఏర్పాటు చేసినా సహాయ కార్యక్రమాలు చేపడుతున్నా ఎప్పటికి కోలుకోవాలని తల్లడిల్లుతున్నారు. ఐదు గ్రామాల్లో విషాదఛాయలు చోటు చేసుకున్నాయి.

## సహాయక చర్యలు ముమ్మరం: ఎస్‌పి

కెవిబిపురం మండలం రాయల్ చెరువుకు గండి పడి ఐదు గ్రామాలు ముంపుకు గురైన సంఘటన తెలిసిన వెంటనే ఆఘమేఘాలపై తిరుపతిజిల్లా ఎస్‌పి సుబ్బరాయుడు వారి సిబ్బందితో కలసి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని పోలీసులను ఇక్కడకు రప్పించారు. అగ్నిమాపక దళాలను సిబ్బందిని రప్పించారు. పుత్తూరు సబ్‌డివిజనల్ అధికారి రవికుమార్ సిఐలు,ఎస్ఐలు కెవిబిపురం, పిచ్చాటూరు సత్యవేడు సిబ్బందిని సహాయక బృందాలుగా రప్పించారుఎస్‌పి గ్రామస్తులతో మమేకమయ్యారు. సంఘటన ఎలా జరిగిందనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎస్‌పి సుబ్బరాయుడు మాట్లాడుతూ సంఘటన జరిగిన వెంటనే పోలీసులు ప్రజలు సమన్వయంతో పని చేయటం వల్ల ఎటువంటి ప్రాణ నష్టం లేకుండా నివారించగల్గినామన్నారు. అదే రాత్రి జరిగి ఉంటే ఊహాతీతం అన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని ప్రజలకు



సూచనలు చేస్తూ ముంపు నీరు అధికంగా ఉన్న ప్రాంతాల్లో వెళ్లరాదన్నారు.చెరువులు వాగులు,వంకల సమీపంలో నివసించే ప్రజలు ప్రత్యేకంగా అధికారుల సూచనలు పాటించాలన్నారు.

## అండగా ఉంటాం: ఆదుకుంటాం : జిల్లా కలెక్టర్

రాయలచెరువుకు గండి పడి ఐదు గ్రామాలు ముంపుకు గురి కావటం భారీ ఎత్తున నష్టం వాటిల్లటం బాధాకరంగా ఉందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, సత్యవేడు శాసనసభ్యుడు ఆదిమూలం అన్నారు. గురువారం విజయవాడ పర్యటనలో ఉన్న జిల్లా కలెక్టర్ రాయల్‌చెరువు సంఘటన తెలుసుకొని హుటాహుటిన సాయంత్రానికి చేరుకున్నారు. గ్రామాల్లో విద్యుత్ సరఫరా లేకున్నా ఆయన పర్యటించి పరిస్థితి సమీక్షించారు. 'బాధితులను ఓదార్చుతూ ఎవ్వరూ బాధ పడకండి ప్రభుత్వం మిమ్ముల్ని ఆదుకుంటుంది అండగా ఉంటుందని' భరోసా ఇచ్చారు. కలెక్టర్‌కు శాసనసభ్యుడు ఆదిమూలం,బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్ నష్టాలు, ఉదయం నుంచి ప్రజలు పడుతున్న అవస్థలు,ప్రాణాలు కాపాడుకోవటానికి పడిన బాధలను వివరించారు. కలెక్టర్ వెంకటేశ్వరన్ మాట్లాడుతూ ఇక్కడ చోటు చేసుకున్న సంఘటన బాధాకరం అన్నారు. పశువులు వరదలో కొట్టుకుపోయాయని పంటలు నష్టపోయారని మళ్ళీ పంటలు వేసుకోవటానికి వీలు లేని విధంగా ఇసుక మేటలు వేసినట్లు గుర్తించామన్నారు. ముంపు వల్ల ఇళ్ళు కూలినాయని అలాంటి వారికి వెంటనే హౌసింగ్‌లో ఇళ్ళు మంజూరు చేస్తామన్నారు. పశు సంపదను కోల్పోయిన వారికి వవెంటనే పశుసంవర్ధక శాఖచే ఆదుకుంటామన్నారు.



# హతి రాంజీ కాలనీలో పొంగిపొర్లుతున్న డ్రైనేజీ



హతి రాంజీ కాలనీలో రోడ్లపై పొంగిపొర్లుతున్న డ్రైనేజీ

### - దుర్గంధంగా మారిన రోడ్లు - పట్టించుకోని మున్సిపల్ అధికారులు, సిబ్బంది
### - కమిషనర్ స్పందించాలని స్థానిక ప్రజల విజ్ఞప్తి

తిరుపతి కలెక్టరేట్, నవంబర్ 6 ,ప్రభాతవార్త :

తిరుపతిలో చిన్న పాటి వర్షానికి డ్రైనేజీ కాలువలు పొంగిపొర్లుతున్నాయి. ఆ డ్రైనేజీ నుండి మలమూత్రాదులు రోడ్లపై ప్రవహిస్తున్నాయి. అటు ఇటు వెళుతున్న పాదచారులు, వాహనదారులు ఆ దుర్గంధ భరితమైన కాలువలలో ప్రయాణించాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. ప్రధానంగా తిరుపతి రాయల చెరువు రోడ్డు అన్నమయ్య సర్కిల్ సమీపంలోని హతి రాంజీ కాలనీలో హనీ మెస్ వద్ద ఈ సంఘటన చోటుచేసుకుంది. పలు పర్యాయాలు ఆ వీధిలోని డ్రైనేజీ కాలువ పొంగి పొర్లతున్న ఇటు మున్సిపల్ అధికారులు గాని అటు మున్సిపల్ సిబ్బంది గానీ పట్టించుకునే పాపాన పోలేదు. తీరా మున్సిపల్ అధికారులు సిబ్బంది మెస్సుకు వచ్చి పుష్టికరమైన భోజనాన్ని తిని వెళుతున్నారే తప్ప. ఆ సమస్యను పరిష్కరించిన పాపాన పోలేదు. దీనిపై మున్సిపల్ కమిషనర్, ఇంచార్జ జెసి మోర్య స్పందించి వెంటనే పొంగిపొర్లుతున్న డ్రైనేజీ కాలువ సమస్యను పరిష్కరించి, ఆ వీధిలో చెత్తాచెదారం లేకుండా పరిశుభ్రంగా చేయాల్సిన పరిస్థితి ఎంతైనా ఉంది.



# యువకుడు దారుణ హత్య

### కిరాతకంగా చంపి సంపులో పడేసిన వైనం....
### పాత కక్షాలా? వివాహేతర సంబంధమా?

రేణిగుంట నవంబర్ 6 ప్రభాతవార్త



రేణిగుంట టపాసుల గోడౌన్ మార్గంలోని రాజశ్వరి నగర్ లక్షీ ్మ నివాస్ బ్రాందీ షాప్ వద్ద అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న పాతబడిన అపా ర్ట్మెంట్ సంపులో సుమారు 35 సంవత్సరాల గుర్తు తెలియని యువకుడు హత్య కావింపబడి ఉండడం గురువారం ఆలస్యంగా వెలుగుచూ చింది. విషయం తెలుసుకున్న వెంటనే గాజుల మండ్యం ఎస్సై సుధాకర్ తమ సిబ్బందితో సం ఘటన స్థలం చేరుకున్నారు. కొద్దిసేపటికి రేణి గుంట అర్బన్ సీఐ (రూరల్ ఇంచార్జ్) జయచంద్ర అక్కడికి వచ్చారు. సంఘటన స్థలాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. మృతదేహాన్ని సంపు నుండి బయటకు తీయించారు.హత్య గావింపబడిన వ్యక్తి కాళ్లు చేతులు కట్టేసి, నోటిని గుడ్డలతో చుట్టేసి అతి దారుణంగా హత్య చేసి మృతదేహాన్ని పచ్చ పాలిథిన్ కవర్లో చుట్టి సంపులో పడేసి ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. మృతుని వద్ద లభించిన టాబ్లెట్లు ఇన్హేలర్ ను బట్టి మృతుడు ఆస్మా పేషెంట్ గా పోలీసులు భావిస్తున్నారు. యువకుడిని వేరే ప్రాంతంలో హత్య చేసి ఒక పథకం ప్రకారం సంపులో పడేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య గావింపబడడానికి పాత కక్షలు లేదా వివాహేతర సంబం ధమైన కారణం అయ్యుండవచ్చు అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు క్లూ టీం ను పిలిపించి దర్యాప్తు వేగవంతం చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించడానికి వచ్చిన డిఎస్పి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసును 24 గంటల్లో చేదిస్తామన్నారు. కేసులో పురోగతి సాధిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే నిందితులను గాలించడానికి మూడు టీం లను ఏర్పాటు చేసినట్లు

## ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్ విశ్వనాధ రెడ్డి సస్పెండ్

తిరుపతి విద్య, నవంబర్ 6 ప్రభాత వార్త:

శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్ విశ్వనాథ్ రెడ్డిని సస్పెండ్ చేసినట్లు ఎస్ వి యు రిజిస్టర్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ర్యాగింగ్ చేయించినట్లు యాంటి ర్యాగింగ్ కమిటీ నిర్ధారణకు రావడంతో తనని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.ఇంటరాక్షన్ సెషన్ లో పేరుతో హెచ్ ఓ డి ర్యాగింగ్ చేయించారని ఎం ఎస్ సి సైకాలజీ ఫస్ట్ విద్యార్థులు ఫిర్యాదుతో సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

### పక్కా ఆధారాల కోసం

# తొలిరోజే ఉరుకులు పరుగులు!

### పరకామణి భవనం,కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన
### ఊహాగానాలు సృష్టించోద్దు : తిరుమలలో సిఐడి చీఫ్ అయ్యన్నార్




తిరుమల,నవంబర్ 6ప్రభాతవార్తప్రతినిధి:

టిటిడి పరకామణిలో 2023లో అమెరికన్ డాలర్లు చోరీ కేసులో నిందితుడుగా ఉన్న సివి రవికుమార్ ఆస్తులను గుర్తించి,తదుపరి లోతుగా విచారణ చేయడానికి సిఐడి అధికారుల బృందం రంగంలోకి దిగింది. తొలిరోజు గురువారం ఉదయం సిఐడి చీఫ్ రవిశంకర్‌అయ్యన్నార్, ఎస్పీలు, డిఎస్పీలు,సిఐల బందం ఐదుటీమ్‌లుగా విడిపోయి తిరుమల,తిరుపతిలో క్షేత్రస్థాయిలో దర్యాప్తు మొదలుపెట్టేసింది. తొలిరోజే సిఐడి వేగవంతమైన విచారణలో ఉరుకులుపరుగులతో తిరుమలలోని పరకామణి భవనం, కమాండ్ కంట్రోల్ రూమ్, సిసి టివి దృశ్యాలు, చోరీచేస్తూ నిందితుడు పట్టుబడిన ప్రాంతం పరిశీలించారు. ఈచోరీకేసులో ఇప్పటివరకు చోటుచేసుకున్న పరిణామాలపై హైకోర్టు న్యాయమూర్తి ఆదేశాలతో సిఐడి డిజి క్షేత్రస్థాయిలోకి రంగంలోకి దిగారు. తిరుమల డిఎస్పీ కె.విజయశేఖర్, టిటిడి విఎస్ఓ ఎన్టీవిరామ్‌కుమార్‌ను వెంటబెట్టుకుని సిఐడి డిజి అవసరమైన సమాచారాన్ని సేకరిస్తున్నారు. లోక్‌అదాలత్‌లో మధ్యవర్తిత్వం, రాజీచేసుకోవడం వరకు సమగ్రంగా సమాచారం తెలుసుకున్నారు. పరకామణిలో కొందరి సిబ్బంది విధుల విషయంలో పర్యవేక్షణ లోపం ఉందనేది స్పష్టంగా తెలుస్తోందని డిజి వ్యాఖ్యానించడం విశేషం. అన్ని కోణాల్లో దర్యాప్తు మొదలుపెట్టామని, డిసెంబర్ 2వతేదీకి హైకోర్టుకు నివేదిక సమర్పిస్తామని డిజి రవిశంకర్‌అయ్యన్నార్ మీడియాకు తెలిపారు. ఈ కేసులో విచారణ, దర్యాప్తుపై ఊహాగానాలు వద్దని, మరింతగా సమాచారం హైకోర్టుకు అందజేస్తామన్నారు. ఈ కేసులో అక్రమాలు అవకతవకలు జరిగాయనేది స్పష్టమైందని, సమగ్ర దర్యాప్తు చేపడతామన్నారు. రవికుమార్‌కు అతని కుటుంబసభ్యులకు సంబంధించి ఆస్తులు ఎక్కడెక్కడ ఉన్నాయి?ఏ మేరకు ఆస్తులు సంపాదించారు అనే వివరాలు రాబట్టే పనిలో వేగంగా కదులుతున్నారు. 2023 ఏప్రిల్‌నెలలో 920 అమెరికన్ డాలర్లు చోరీచేస్తూ పట్టుబడిన రవికుమార్;పై తిరుమల వన్‌టౌన్ పోలీసులు 24/2023లోనే కేసు కూడా నమోదు చేశారు. ఆ తరువాత సమగ్ర విచారణ చేయాల్సిన పోలీసులను టిటిడి పెద్దలు ఎవరు నీరుగార్చేలా ప్రోద్భలం చేశారనేది పూర్తిస్థాయి విచారణ తరువాత డిసెంబర్ 2వతేదీకి సిఐడి డిజి సీల్డ్‌కవర్ నివేదికల్లో వెల్లడికానుంది.

# గ్రేటర్ దిశగా తిరుపతి!

### లింగేశ్వర్‌నగర్ పంచాయతీ విలీన ప్రతిపాదనపై కలెక్టర్ షాకాజ్ నోటీసు
### -ప్రజాభిప్రాయం తీర్మానం ఇవ్వమని ఆదేశం
### -10 రోజుల్లో సమాధానం కోరిన కలెక్టర్



తిరుపతిరూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త:

తిరుపతి నగరం త్వరలో 'గ్రేటర్ తిరుపతి'గా మారే దిశగా అడుగులు వేస్తోంది. నగర పరిసర గ్రామ పంచాయతీలను మున్సిఫల్ కార్పొరేషన్‌లో విలీనం చేయాలన్న ప్రతిపాదనపై జిల్లా పరిపాలన చర్యలు మొదలు పెట్టింది. ఈ క్రమంలో తిరుపతిరూరల్ మండలంలోని లింగేశ్వర్‌నగర్ గ్రామ పంచాయతీకి జిల్లా కలెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్ షోకాజ్ నోటీసు జారీ చేసారు.

**కౌన్సిల్ తీర్మానం - గ్రేటర్ ప్లాన్‌కు అమోదం**

తిరుపతి మునిసిఫల్ కార్పొరేషన్ కౌన్సిల్ ఇటీవల జరిగిన సమావేశంలో (24-10-25, తీర్మానం నెం.279) నగర పరిధిని విస్తరించి "గ్రేటర్ తిరుపతి మున్సిఫల్ కార్పొరేషన్"గా ఏర్పాటు చేయాలని ఏకగ్రీవంగా తీర్మానించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో పరిసర గ్రామ పంచాయతీలైన లింగేశ్వర్‌నగర్, చంద్రగిరి మండల పరిసర ప్రాంతాలు తదితరాలను విలీనం చేసే ప్రతిపాదనలు కలెక్టర్ కార్యాలయానికి పంపాయి.

**గ్రామ పంచాయతీల తీర్మానాన్ని 10 రోజుల్లో తెలియజేయాలి**

ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ,ఎం.ఎస్.నెం.114 ప్రకారం ఏదైనా గ్రామ పంచాయతీని మునిసిఫల్ పరిధిలో చేర్చే ముందు, ఆ గ్రామ పంచాయతీ అభిప్రాయాన్ని తీర్మానం రూపంలో తప్పనిసరిగా పొందాల్సిన అవసరం ఉంది. దీన్ని అనుసరించే కలెక్టర్ వెంకటేశ్వర్ లింగేశ్వర్‌నగర్ పంచాయతీలో 10రోజుల్లో సమావేశం నిర్వహించి ప్రజాభిప్రాయ నిర్ణయ తీర్మానాన్ని జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి పంపాలని షోకాజ్ నోటీసు జారీ చేసారు.

**గ్రేటర్‌లో గ్రామ పంచాయతీలు విలీనంతో వచ్చే మార్పులు**

గ్రామ పంచాయతీలను గ్రేటర్ తిరుపతిలో విలీనం చేయడం ద్వారా పలు మార్పులు రానున్నాయి. పట్టణీకరణతో మెరుగైన పౌర సేవలు అందుబాటులోకి రానున్నాయి. రహదారులు, మురుగునీటి వ్యవస్థ, వీధి దీపాల వసతులు మెరుగవుతాయని అధికారుల అంఛనా. పట్టణ, గ్రామ అభివృద్దిలో వ్యత్యాసం తగ్గుతుందని కౌన్సిల్ భావన. సమర్ధవంతమైన స్థానిక పాలన, ఆధాయ వృద్ధి అవకాశాలు పెరుగుతాయని నివేదిక.

**గ్రేటర్‌పై ప్రజల్లో మిశ్రమ స్పందన**

అభివృద్ధి కోసం గ్రేటర్‌లో పంచాయతీలను విలీనం మేలు చేస్తుందని భావిస్తుండగా, మరి కొందరు పన్నులు పెరగడం, గ్రామ స్వయం పాలన కోల్పోవడంపై అందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి పన్నులు పెరగడంతో పాటు ఏడాదికి రెండు పర్యాయాలు ఇంటి పన్నులు చెల్లించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలు ఇచ్చే తీర్మానాలను జిల్లా పరిపాలన పరిశీలించిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనున్నది. గ్రేటర్ తిరుపతి మునిసిఫల్ కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉందని అధికారులు సూచిస్తున్నారు. గ్రేటర్ తిరుపతి మున్సిఫల్ కార్పొరేషన్ రూపకల్పనపై ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమిక పరిశీలనలు పూర్తి చేసింది. తిరుపతిరూరల్, చంద్రగిరి మండల పరిసర పంచాయతీలను గ్రేటర్‌లో చేర్చే అవకాశం ఉంది.

**10రోజుల్లో ప్రజాభిప్రాయ నివేదిక ఇవ్వండి : ఎంపిడిఓ దయాసాగర్**

తిరుపతిరూరల్ మండలంలోని 34 గ్రామ పంచాయతీలలో ప్రజాభిప్రాయాన్ని సేకరించి 10 రోజులలో తీర్మాన నివేదికను ఇవ్వాలని తిరుపతిరూరలల్ ఇన్‌చార్జి ఎంపిడిఓ దయాసాగర్ పంచాయతీ కార్యధర్ములను ఆదేశించారు. ఈ మేరకు ఎంపిడిఓ ఛాంబర్‌లో పంచాయతీ కార్యధర్ములతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీలలో పంచాయతీ బోర్డు తీర్మాన నివేదికను డిపిఓ కార్యాలయానికి అందించాలని సూచించారు.

## వరమనూరులో ఉచిత రక్త పరీక్షల శిబిరం

**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో మండలంలోని వరమనూరులో వైద్య సిబ్బంది ఉచిత రక్త పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు గ్రామస్తులనుంచి రక్త నమూనాలు సేకరించారు. వార్డు మెంబర్, నియోజకవర్గ ఐటిడిపి ఉపాధ్యక్షుడు ఇఆర్‌బి బాలాజీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టి సారించి ఈ రక్త పరీక్షల శిబిరాలు నిర్వహిస్తున్నారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## నేటినుంచి తెదేపా పంచాయతీ సమావేశాలు

**శాంతిపురం, నవంబర్ 6 ప్రభాతవార్త**

సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో ఈనెల 7-15తేదీల వరకు శాంతిపురం మండల తెదేపా గ్రామ పంచాయతీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు ఉదయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి మంజునాథ్ తెలిపారు. 7న సొన్నేగానిపల్లి, ఎంకెపురం, మఠం,దండికుప్పం, 10న కొలమడుగు, శివరాంపురం, అబకలదొడ్డి, గుంజార్లపల్లిలో సమావేశాలు జరుగుతాయన్నారు. 12న తుమ్మిశి, మొరసనపల్లి, నడింపల్లి,చిన్నారిదొడ్డి, 13న కర్లగట్ట, కడపల్లి, 64పెద్దూరు, బండపల్లి,14న రాళ్లబూదుగూరు, కోనేరుకుప్పం, 121పెద్దూరు,చెంగుబళ్ల, 15న రేగడదినేనపల్లి,కెనమాకులపల్లి పంచాయతీలో సమావేశాలుజరుగుతాయన్నారు. పార్టీ శ్రేణులుతప్పక హాజరు కావాలని కోరారు.

## రైతులకు యూరియా పంపిణీ

**రామకుప్పం,నవంబర్ 6 ప్రభాతవార్త**

మండలంలోని ఉస్సిగానిపల్లి రైతు సేవా కేంద్రంలో కూటమి నేతలు రైతులకు యూరియా బస్తాలు పంపిణీ చేశారు. రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను ప్రభుత్వం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు రామూర్తి,జయశంకర్, మహేంద్రనాయుడు, రామలింగం, శంకరాచలం, బీరప్ప, మంజునాథ్, సుబ్రమణ్యం, రాజప్ప పాల్గొన్నారు.

## చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి ఎంపిక

**రామకుప్పం,నవంబర్ 6 ప్రభాతవార్త**



మండలంలోని ఆనిగానూరు హైస్కూల్‌కుచెందిన విద్యార్థులుచెకుముకి టాలెంట్ టెస్ట్‌లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం ఆదిశేషయ్య తెలిపారు. విద్యార్థులు కార్తీక్, ఉదయశ్రీ, రమ్యశ్రీలు ప్రతిభ చూపారన్నారు. ఈసందర్భంగా వారిని అభినందించారు.యూనిట్ ఇన్‌చార్జ్ రామూర్తి,ఎస్‌ఎంసిచైర్మన్ బీరప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## రైతులకు అందుబాటులో వర్మికంపోస్ట్ ఎరువులు

**వి.కోట, నవంబర్ 6 ప్రభాతవార్త**



వి.కోట మేజర్‌పంచాయతీ అధ్వర్యంలో నిర్వహిస్తున్న చెత్త సంపద తయారీ కేంద్రంలో వర్మికంపోస్ట్ ఎరువులు రైతులకు విక్రయానికి అందుబాటులో ఉంచినట్లు ఇఒ నరేష్ తెలిపారు. వర్మికంపోస్ట్ ఎరువులు అవసరమైన రైతులు వి.కోట పంచాయతీ కార్యాలయంలో నిర్ణీత ధర చెల్లించి పొందాలన్నారు. వర్మిక ంపోస్ట్ ఎరువుల వాడకంతో భూసారం పెరిగి పంటలు ఆరోగ్యంగా సాగవుతాయన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## కుప్పంలో మోస్తరు వర్షం.. స్థంభించిన జనజీవనం

**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త**

కుప్పం నియోజకవర్గంలో గురువారం ఉదయం నుంచే మోస్తరు వర్షం కురవడంతో జన జీవనం స్థంభించింది.బుధవారం మధ్యాహ్నం నుంచి మొదలైన వర్షం అప్పుడప్పుడూ తెరపి ఇస్తూ కురుస్తోంది. పట్టణంలోని చిరువ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. వర్షం ధాటికి జనం కూడా రోడ్లపై పెద్దగా కన్పించలేదు.

## ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలి అన్నదే ప్రభుత్వ లక్ష్యం

**యర్రావారిపాలెం, నవంబర్ 6, ప్రభాతవార్త:**



యర్రావారిపాలెం మండలం కోటకాడపల్లి పంచా యతీలో ఏఎన్‌ఎమ్ లావణ్య, ఆశవర్కర్‌లు సచివా లయ పరిధిలో ఉన్న వైద్యసేవలు నిత్యం ప్రజలకు అందిస్తున్నారు. వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, విషజ్వరాల ఎక్కువ గా ప్రభలే అవకాశం ఉంటుంది. ప్రజలు కాచిన నీటినే త్రాగాలని, జ్వరాలు వస్తే తమ సచివాలయ పరిధిలో సదుపాయం ఉన్నంతవరకు వైద్యం అందిస్తామని తెలిపారు.అలాగే ప్రతి నిత్యం గ్రామాల్లో పర్యటిస్తూ అనారోగ్యంతో ఉన్నవారికి ఉచిత మందుల పంపిణి చేస్తున్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలి అన్నదే ప్రభుత్వ లక్ష్యం అని లావణ్య తెలిపారు. స్థానిక నాయకులు, ప్రజలు సైతం నిత్యం ప్రజల్లో ఉండటం సంతోషంగా ఉందని తెలిపారు. అందరు కూడా ప్రభుత్వం అందించే వైద్యసేవలు బాధ్యతగా ప్రజలుకు చేరితే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. చిన్న చిన్న జబ్బులకు లక్షలకు లక్షలు పెట్టి ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళ్ళాల్సిన పని ఉండదు.

## 23న కరుణిగర్ అభ్యుదయ సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం

**తిరుపతి హెల్త్, నవంబర్ 6, ప్రభాతవార్త:**

ఈ నెల 23న కరుణి గర్ అభ్యుదయ సంఘం వార్షిక సర్వ సభ్య సమావేశం ఎన్జీవో ఫంక్షన్ హాల్ ఎస్బిఐ బ్యాంక్ మిద్ది పైన కేటీ రోడ్లో నిర్వహించినట్లు ఆ సంఘం అధ్యక్షులు సీతాపతి తెలియజేశారు. తిరుపతి ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంఘం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దీనిలో భాగంగా కర్ణ కులస్తులను ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా ఎదిగేందుకు తమ వంతు కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా వారు చేస్తున్న మ్యాట్రిమోనీ, చదువుకున్న పిల్లలకు నగదు బహుమతులు, మెడికల్ క్యాంపులు, పలు సేవా కార్యక్రమాలను గుర్తు చేశారు. మరిన్ని వివరాలకు 9985052209ను సంప్రదించవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు రమణ, రవి, శ్రీధర్, చంద్రశేఖర్, సోమ సుందర్, తులసి రామ్ పిల్లై, తదితరులు పాల్గొన్నారు.

## రాస్ ఆధ్వర్యంలో సమగ్ర వైద్య శిబిరాలు...

**రేణిగుంట నవంబర్ 6 ప్రభాతవార్త**




రాస్ ఆధ్వర్యంలో ఇండియన్ పొటాష్ లిమిటెడ్ ఆర్థిక సహకారంతో రేణిగుంట మండలం గాజుల మండలం, అత్తూరు, నల్ల పాలెం తదితర గ్రామాల్లో గురువారం రాస్ ప్రధాన కార్యదర్శి వెంకటరత్నం నాయుడు సమగ్ర వైద్య శిబిరాలను ప్రారంభించారు. కొన్ని గ్రామాల్లో ప్రముఖ కార్పొరేట్ వైద్యశాలల వైద్యుల ద్వారా ఉచిత వైద్య శిబిరాన్ని, మరికొన్ని చోట్ల పశువైద్యుల ద్వారా ఉచిత మెగా పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ అర్జున్, గైనకాలజిస్ట్ డాక్టర్ నిహారిక, పీడియాట్రిక్ డాక్టర్ కళ్యాణి, డెంటిస్ట్ డాక్టర్ శిరీష రావు తమ సిబ్బందితో శిబిరానికి వచ్చిన వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. అదేవిధంగా మండల పశు వైద్య సహాయ సంచాలకురాలు సునీత, పశు వైద్యులు రెడ్డప్ప రెడ్డి, స్రవంతి, అనుష తదితరులు శిబిరానికి తోలుకొచ్చిన పశువులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి పశువుల పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను పాడి రైతులకు వివరించారు. కార్యక్రమములో ఐపీఎల్ సంస్థ బ్రాంచ్ మేనేజర్ బాలసుబ్రమణ్యం, కృషి విజ్ఞాన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు, బాలాజీ బాలవికాస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ రెడ్డి, ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి, సికేఎస్ దంత వైద్యశాల వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.

## డ్రగ్స్ పై సీఎం ఉక్కు పాదం



**తిరుపతి హెల్త్, నవంబర్ 6, ప్రభాతవార్త :** డ్రగ్స్ పై సీఎం నారా చంద్రబాబు నాయుడు ఉక్కు పాదం మోపినట్లు శాప్స్ చైర్మన్ రవి నాయుడు అన్నారు. తిరుపతి ప్రెస్క్లబ్లో గురువారం ఏర్పాటు చేసిన విలే కరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి గంజాయిని ప్రోత్సహిస్తే సీఎం నారా చంద్రబాబు నాయుడు వాటి నిర్మూలనకు పెద్దపీట వేయడం జరిగిందన్నారు. సాక్షాత్ వైసిపి విద్యార్థినేత కొండారెడ్డి గంజాయి కేసులో అడ్డంగా దొరికితే అతన్ని పార్టీ నుండి సస్పెండ్ చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. తీరా విద్యార్థి సంఘాలతో సమావేశాలు జరపడం బాధాకరమన్నారు. గంజాయిని ప్రేరేపించే వైసిపి నేతలు కార్యకర్తలను కూటమి తగిన బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి అనుబంధ విద్యార్థి సంఘాల నేతలు సభ్యులు పాల్గొన్నారు.

## ఎస్‌వియు అధికారులపై కేసు నమోదు చేయాలి

**వైఎస్ఆర్ సి పి విద్యార్థి విభాగం ఫిర్యాదు**



**తిరుపతి విద్య, నవంబర్ 6 ప్రభాతవార్త:**

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ భూపతి నాయుడు, ఎస్.ఓ. మోహన్ నాయుడుపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ క్యాంపస్ పోలీస్ స్టేషన్‌లో సిఐకి ప్రేమ్‌కుమార్ గురువారం ఫిర్యాదు చేశారు.ఇటీవల విశ్వవిద్యాలయంలో జరిగిన ర్యాగింగ్ ఘటనలో ప్రమేయం ఉన్న హెచ్ఓడీ ని, విద్యార్థులను సస్పెండ్ చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు రెక్టార్ చాంబర్ ముందు ధర్నా నిర్వహించారు. అయితే,ఆ ధర్నాలో పాల్గొన్న విద్యార్థి నాయకులపై తప్పుడు కేసులు నమోదు చేయడం జరిగింది.ఈ విషయం తెలిసిన ప్రేమ కుమార్ ఆ ధర్నా స్థలానికి చేరుకునే సమయానికి డిఎస్పీ పరిస్థితిని సద్దుమణిగించారు.కానీ రిజిస్ట్రార్ ప్రేమ్ కుమార్ కు ఎలాంటి సంబంధం లేకపోయినా,తన అనుచరుడైన ఎస్.ఓ. మోహన్ నాయుడుని ఉపయోగించి తను మీద తప్పుడు కేసు పెట్టించారు అని వాపోయ్యారు.ఇది కేవలం నేను దళితుడిననే భావనతో చేసిన వివక్ష చర్య అని, గతంలో దళిత విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అనేకసార్లు ఆయన దృష్టికి తీసుకెళ్లి నందువల్ల,దళితుడు నా ముందు ఎలా నిలబడగలడు" అనే భావనతోనే ఈరోజు నా మీద తప్పుడు కేసు పెట్టించడం జరిగింది అని తెలిపారు.దళిత విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి అని అడగడమేనా నేను చేసిన తప్పు? దళిత జాతిలో పుట్టడమేనా నా పాపం? ఈ సంఘటనల కారణంగా నేను తీవ్ర మనస్థాపానికి గురవుతున్నాను అని అన్నారు.

## ఇద్దరు మృతి కేసులో ముద్దాయి అరెస్టు

**బంగారుపాళ్యం, నవంబర్ 6 ప్రభాతవార్త:**



ఈ నెల 3వ తేదీ బండ్లదొడ్డి వ్యవసాయ పొలాల్లో అడవి పందుల కోసం వుంచిన ఉచ్చుల్లో పడి ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి ముద్దాయి అదే గ్రామానికి చెందన రామరాజను బలిజపల్లి క్రాస్ వద్ద గురువారం సాయంత్రం అరెస్టు చేసినట్లు ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు తెలిపారు. అడవి జంతువుల మాంసం కోసం బండ్లదొడ్డికి చెందిన రామరాజు విద్యుత్ తీగలను అమర్చాడు. ఈ విద్యుత్ తీగలు గుర్తించని అదే గ్రామానికి చెందిన అయ్యప్ప, కుట్టి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. ఈ కేసులో అరెస్టయిన రామరాజును రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

## టీటీడీ చైర్మన్‌ను కలిసిన ఎమ్మెల్యే, కాణిపాకం ఆలయ చైర్మన్‌లు

**కాణిపాకం, నవంబర్ 6 ప్రభాతవార్త:**



తిరుమల తిరుపతి దేవస్థానం చైర్మన్ బిఆర్ నాయుదును పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్, కాణిపాకం దేవస్థానం చైర్మన్ వి.మణినాయుడులు గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. టీటీడీ చైర్మన్‌గా బిఆర్‌నాయుడు పదవీ బాధ్యతలు చేపట్టి ఏడాది పూర్తి కావడంతో ఎమ్మెల్యే మురళీమోహన్, కాణిపాకం ఆలయ చైర్మన్ మణినాయుడులు ఆయన కార్యలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వేదాశీర్వచనం అందజేసి స్వామివారి జ్ఞాపికను, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## కూలిన దశాబ్దాలనాటి చింతచెట్టు - తప్పిన ప్రమాదం



**చౌడేపల్లి, నవంబర్ 6 ప్రభాతవార్త** గ్రామంలో దశాబ్దాల తరబడివున్న పెద్దచింతచెట్టు నేలకూలింది. రోడ్డుపడటంతో కొంతసేపు ట్రాఫిక్‌కు అంతరాయం వాటిల్లింది. చౌడేపల్లి-బోయకొండ ప్రధాన రహదారిలోగల మేకలవారిపల్లి ప్రభుత్వ పాఠశాలకు కూతవేటు దూరంలో వందేళ్ళనాటి చింతచెట్టు వుంది. ఇటీవల కురిసిన వర్షాలకు చింతచెట్టు ప్రధాన రహదారికడ్డంగా కూలింది. దీంతో వాహన రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. సమాచారమందుకొన్న ఎస్ఐ నాగేశ్వరరావు సిబ్బందిని తరలించి చెట్టును రహదారి నుంచి తొలగించడంతో వాహనాలు యధావిదిగా వెళ్ళాయి. కూలిన చింతచెట్టుకిందనే గ్రామస్తులు దుకాణాలు ఏర్పాటు చేసుకొని వుంటారు. చెట్టు కూలే సమయంలో వారెవరూ లేకపోవడం, ఇటు పాఠశాలపై పడకపోవడంతో పెను ప్రమాదమే తప్పింది. గ్రామస్తులందరూ ఊపిరి పీల్చుకున్నారు.

## అంతా బాగుంది అన్నీ అందుతున్నాయి...!

**-విచారణలో లబ్దిదారుల వెల్లడి**



**ఆమినిగుంట(చౌడేపల్లి), నవంబర్ 6 ప్రభాతవార్త** అంగన్‌వాడీ కేంద్రం పరిశుభ్రంగా వుంది తమకంతా బాగుంది అన్నీ అందుతున్నాయని లబ్దిదారులు అధికారులకు తెలిపారు...రాష్ట్ర మహిళా కమీషన్ సభ్యురాలు రుకియాబేగం ఈనెల 5న ఆమినిగుంట అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన విషయం విదితమే. ఇక్కడ పనిచేస్తున్న కార్యకర్త కమలమ్మ పలు అవినీతి ఆరోపణలు చేస్తున్నట్లుగా లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందిందనీ, ఆమెపై చర్యలు తీసుకోవాలని రుకియాబేగం ఉన్నతాధికారులను ఆదేశించారు. దీంతో స్పందించిన ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ విచారణకు ఆదేశించారు. గురువారం ఈమేరకు ఆమినిగుంటకు చేరుకొని పంచాయతీ పెద్దలు, అంగన్‌వాడీ కేంద్రం పరిధిలోని లబ్దిదారులను పిలిపించారు. ప్రభుత్వమందిస్తున్న పౌష్టికాహారం అందరికీ అందుతోందనీ, కార్యకర్త తమపట్ల మర్యాదపూర్వకంగా వుంటోందని అధికారుల ఎదుట వారు పేర్కొన్నారు. విచారణా నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు సిడిపిఒ రాజేశ్వరీ తెలిపారు. పంచాయతీ పెద్దలు జంపాల శ్రీనివాసులు, శంకరయ్య, ఐసిడిఎస్ సీనియర్ అసిస్టెంట్ కళ్యాణి, సూపర్‌వైజర్లు ఆయేషా, రాధ, మహిళా పోలీసు రేఖ, కేంద్రం పరిధిలోని లబ్దిదారులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో అన్న ప్రసాన

**చౌడేపల్లి, నవంబర్ 6 ప్రభాతవార్త**



మండల కేంద్రమైన చౌడేపల్లి-4 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం చిన్నారులకు అన్న ప్రాసనా కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్రంలో 40మంది చిన్నారులుండగా వారిలో ఇద్దరికి అన్న ప్రసానను చేసారు. ఈ సందర్భంగా కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. అనంతరం గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారాన్నందించారు. తీసుకొన్న ఆహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యకర్త భార్గవి, ఆయా లక్ష్మీ, కేంద్రం పరిధిలోని చిన్నారులు వారి తల్లులు పాల్గొన్నారు.

## యూరియా కొరతలేదు : ఏవో



**పూతలపట్టు, నవంబర్ 6, ప్రభాతవార్త** రైతులకు యూరియా కొరత లేకుండా ప్రభుత్వం పుష్కలంగా అందిస్తున్నట్లు వ్యవసాయ అధికారి మధురవాణి తెలిపారు. యూరియా కార్డుల ద్వారా ప్రతి రైతుకు అందించేలా చెరువులు తీసుకుంటున్నామని రైతులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేశారు. రైతులకు కావలసిన అంత వేరే ప్రభుత్వం ఇస్తుందని చెప్పారు సొసైటీల ద్వారా యూరియాని ఇస్తున్నట్లు తెలిపారు.

## ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారంకు చర్యలు - ఆర్డీఓ శ్రీనివాసులురాజు

**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త**



కుప్పం డివిజన్ పరిధిలో ఉన్న ఎస్సీ,ఎస్టీల సమస్యల పరిష్కారంకు తగుచర్యలు తీసుకుంటామని కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు పేర్కొన్నారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి విజిలెన్స్ మరియు మానిటరింగ్ కమిటీ సమావేశంను ఆర్డీఓ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన దళిత, గిరిజనుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇతర ప్రభుత్వ సేవల గురించి వివరించారు.ఈసందర్భ ంగా దళిత,గిరిజన నాయకులు పలు సమస్యలను ఆర్డీఓ దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారంకు తగు చర్యల నిమిత్తం సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో డిఎస్పీ పార్థసారథి, తహశీల్దార్లు చిట్టిబాబు, సీతారాం, ప్రకాష్‌బాబు, సభ్యులు కృష్ణనాయక్, నేతలు రవి నాయక్, రాజ్‌కుమార్, ప్రకాష్, దేవరాజు, నరసింహులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఉచిత రక్త పరీక్షలు చేయించుకోవాలి

**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త**



సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాలతో కుప్పంలో భవ్య సంస్థచే నిర్వహిస్తున్న ఉచిత రక్త పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కౌన్సిలర్ జాకీర్ కోరారు. గురువారం స్థానిక 18వ వార్డులో వైద్య సిబ్బంది ప్రజలనుంచి రక్త నమూనాలుసేకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 49రకాల రక్తపరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రజలకు ఏదేని ఆరోగ్య సమస్యలు ఉంటే ప్రభుత్వం వారి చికిత్సకు తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఈసందర్భంగా ఆయన సిఎం చంద్రబాబునాయుడు, ప్రభుత్వ విప్ డా॥ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా చైర్మన్ డా॥ బిఆర్ సురేష్‌బాబులకు కృతజ్ఞతలు తెలిపారు.

## నారా భువనమ్మ మహిళలకు స్ఫూర్తి

**- కడ సభ్యురాలు సుగుణమ్మ**



**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త** సిఎం చంద్రబాబు నాయుడు సతీమణి,ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరమ్మ మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారని కడ పిఎసి సభ్యురాలు సుగుణమ్మ పేర్కొన్నారు. ఓ పక్క ఎన్టీఆర్ ట్రస్ట్ తరపున సామాజిక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తూ అంతర్జాతీయ స్థాయిలో అవార్డుఅందుకోవడం హర్షదాయకమన్నారు. నారా భువనమ్మ చేస్తున్న సేవా కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. అలాగే మహిళల క్రికెట్ జట్టు ప్రపంచకప్ సాధించి దేశానికి మరింత వన్నె తెచ్చారన్నారు.

## రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు విరిగిన కాలు



**కుప్పం, నవంబర్ 6 ప్రభాతవార్త** కుప్పం - కృష్ణగిరి జాతీయ రహదారి లో నడిమూరు వద్ద గురువారం రెండు లారీలు ఢీకొన్న సంఘటనలో ఓ డ్రైవర్‌కు కాలు విరిగింది. ఈసంఘటనకు సంబంధించి అర్బన్ ఎస్ఐ బాబు తెలిపిన మేరకు వివరాలిలా.. కృష్ణగిరి నుంచి ఉత్తరాది రాష్ట్రాలకు వెళ్తున్న లారీ, కుప్పం వైపునుంచి కృష్ణగిరి వైపు వెళ్తున్న లారీలు రెండూ ఢీకొన్నాయన్నారు. ఈ ప్రమాదంలో ఉత్తర ప్రదేశ్‌కు చెందిన లారీ డ్రైవర్ కిషోర్ దేవ్ (29)కు కాలు విరిగిందన్నారు.ఓ లారీ ముందరిభాగం నుజ్జు నుజ్జయిందన్నారు. క్షతగాత్రుడ్ని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సెంట్రల్ టీమ్‌చే వైద్యశాల తనిఖీ

**సదుం, నవంబర్ 6 ప్రభాతవార్త**



సదుంలోని కమ్యూనిటీ హెల్త్ ఆసుపత్రిని మరియు చెరుకువారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నడిగడ్డ ఆయుష్మాన్ భారత్ కేంద్రమును కేంద్ర పరిధిలో నీ ఆరోగ్యశాఖ సంబంధించిన అధికారుల బృందం గురువారం తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సహాయంతో గ్రామీణ ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవలపై వివరాలు ఆరా తీశారు. టీబీ, కుష్టు వ్యాధ,సురక్షిత కాన్పులు,పిల్లలకు అందించి టీకాలు,అంగన్వాడీ కేంద్రం నందు గర్భవతులకు ఇచ్చే పోషకాహారం,స్కూల్ హెల్త్ లో భాగంగా విద్యార్థులకు రక్తహీనత నివారణ కొరకు అందించే ఐరన్ టాబ్లెట్స్ ,నులిపురుగుల నివారణ కార్యక్రమం,విద్యార్థులకు నిర్వహించే ఆరోగ్య పరీక్షలు,పై ఆరా తీశారు. సేవలపై సంతృప్తి వ్యక్తం పరిచి ప్రజలకు ఇంకా అవసరం ఉన్నా సేవల కొరకు ప్రజల వద్ద అభిప్రాయ సేకరణ చేశారు. ఇందులో సెంట్రల్ టీం సభ్యులు డా.సోయా, డా. పార్వతి,డా.అర్పిత,డా.గణేష్ నాయుడు,ధీరజ్ కుమార్ లతో పాటు జాయింట్ డైరెక్టర్ స్టేట్ డా. నిర్మలగ్లోరి,జిల్లా వైద్యారోగ్య అధికారి డాక్టర్ సుదా రాణి,జిల్లా క్షయ, లిప్రసీ అధికారి వెంకటప్రసాద్,ప్రోగ్రామ్ ఆఫీసర్ డా..అనిల్, సిహెచ్ వైద్యాధికారి రాజు, పుష్పకుమారి,పీహెచ్ సి అధికారి డాక్టర్ చరణ్ , ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది మురళి,నీలకంఠ,శిఖామణి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ మనీషా, రషీద్ , ఆరోగ్య కార్యకర్త,సుజాత,ఆశా కార్యకర్తలు శ్యామల,పార్వతి పాల్గొన్నారు

## తెదేపా కార్యకర్త మృతదేహానికి ఎమ్మెల్యే నివాళి

**చిత్తూరురూరల్, నవంబరు 6 ప్రభాతవార్త:**



చిత్తూరు రూరల్ మండలం దిగువమాసాపల్లి గ్రామ పంచాయతీ ఒంటిల్లు కృష్ణాపురం గ్రామానికి చెందిన తెదేపా బూత్ కో కన్వీనర్ జశ్వంత్ బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. గురు వారం జస్వంత్ మృతదేహానికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నివాళులర్పించి వారి కుటుంబ సభ్యు లను ఓదార్చి, అండగా వుంటానని ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెవిన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించండి

**- ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్**



**చిత్తూరురూరల్, నవంబరు 6 ప్రభాతవార్త:**

చిత్తూరు నియోజకవర్గంలోని రెవిన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అధికారులను ఆదేశించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో చిత్తూరురూరల్, అర్బన్ తహశీల్దార్లు, రెవిన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పిజీఆర్ఎస్‌లో భూమి సమస్యలపై ప్రజల నుంచి ఎక్కువగా అర్జీలు వస్తున్నాయనీ, క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పరిష్కరించాలని, అలాగే సర్వేయర్లు, విఆర్‌వోలు ప్రజలకు అందుబాటులో వుండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు కులశేఖర్, జయప్రకాష్, డిటీ ఇబ్రహీం, ఆర్ఐలు, సర్వేయర్లు, విఆర్‌వోలు పాల్గొన్నారు.

## ప్రహరీ కోసం మంత్రి లోకేష్‌ను కలుస్తా

**దేశం నాయకుడు సుకుమార్ బాబు**

**పుంగనూరు నవంబర్ 6 ప్రభాతవార్త**



పట్టణంలోని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణం కోసం విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబును కలుస్తానని దేశం నాయకుడు, విశ్రాంత డిఎస్పి సుకుమార్ బాబు అన్నారు. కళాశాలలో గురువారం నూతన విద్యార్థుల దినోత్సవం జరిగింది. కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాలకు పలు విరాళాలు ప్రకటించారు. ఆయన మాట్లాడుతూ దివంగత నందమూరి తారక రామారావు హయాంలో పుంగనూరులో డిగ్రీ కళాశాల సాధించుకుని వచ్చామని, ఇప్పుడు మంత్రి లోకేష్ బాబు సారథ్యంలో కళాశాలకు ప్రహరీ గోడ మంజూరు చేసుకు వస్తామని తెలిపారు. బసవరాజా ఉమెన్స్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపల్ గంగాధర్ నాయుడు వైస్ ప్రిన్సిపాల్ హరిబాబు పుదిపట్ల సర్పంచ్ రెడ్డప్ప రెడ్డి, ఆర్యవైశ్య తెలుగుదేశం నాయకులు రవికుమార్ హాజరయ్యారు. ఇదే కళాశాల ఆవరణలో ఇండోర్ స్టేడియం ఏర్పాటుకు పదివేల సంతకాల సేకరణ చేస్తామన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థుల ఎంపిక

**సదుం, నవంబర్ 6 ప్రభాతవార్త**





స్థానిక మహాత్మా జ్యోతి పూలే గురుకుల పాఠశాల, కళాశాలలో సీనియర్ ఇంటర్ చదువుతున్న యశ్వంత్ చిత్తూరులోని పి వి కే ఎన్ డిగ్రీ కాలేజీ గ్రౌండ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించనున్న అండర్ 19 బేస్బాల్ పోటీలకు రాష్ట్రస్థాయిలో ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అదేవిధంగా తిరుపతి తారకరామా స్టేడియంలో గురువారం జరిగిన 17వ అథ్లెటిక్స్ 400 మీటర్ల పరుగు పందెంలో ఇదే పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి భాను తేజ జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఆయన చెప్పారు. త్వరలో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలలో ఆ విద్యార్థి పాల్గొంటారని ఆయన పేర్కొన్నాడు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్ని ఉపాధ్యాయులు అభినందించారు.

## గ్యాస్ సిలిండర్ పేలుడు ఘటనలో గాయపడిన మహిళ మృతి

**కాణిపాకం, నవంబర్ 6 ప్రభాతవార్త:**



కాణిపాకంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలిన ఘటనలో తీవ్రంగా గాయపడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందింది. కాణిపాకంఎస్సీ వాడకు చెందిన చిన పాపమ్మ అనే మహిళ గత నెల 29న ఉదయం వంట గదిలో టీ తయారు చేసుకోవడానికి వెళ్లి స్టవ్ వెలిగించింది. దీనితో ఉన్నట్టుండి మంటలు చెలరేగి సిలిండర్ పేలడంతో ఆమెకు నిప్పంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. అలాగే సిలండర్ పేలుడు దాటికి ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈఘటనలో తీవ్రంగా గాయపడిన చిన్న పాపమ్మను 108 అంబులెన్స్ ద్వారా చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే ఆమె పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం రాణి పేట సిఎంసి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురవారం మృతి చెందింది.పేలుడు ఘనటలో మృతి చెందిన చినపాపమ్మ కుటుంబానికి నష్ట పరిహారం అందించి ఆదుకోవాలని ఆమె బంధువులు కోరుతున్నారు.

## శివోహం... కార్తీక జ్వాలతోరణం

**పుంగనూరు రూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త**



పట్టణంలోని పురాతన శైవక్షేత్రం శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామివారి ఆలయంలో జ్వాలాతోరణం వైభవంగా జరిగింది. ముందుగా పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఘనంగా ఊరేగించి, ఆలయ ప్రాంగ ణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆ ఉత్సవ విగ్రహాలను జ్వాలాతోరణం కిందగా తీసుకెళ్లి భక్తులు పరమేశ్వరుని దర్శించుకునేలా చేశారు. ఆలయ అర్చకులు బాలసుబ్రహ్మణ్యం దీక్షితులు, రాము దీక్షితులు ఈ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వ హించారు.ఆతరువాత ఆలయ ఆవరణమంతా మహిళలు దీపాలను వెలిగించి భగవంతునికి ప్రార్థనలు చేశారు.

## బాధ్యతలు చేపట్టిన తహసిల్దారు షబీర్‌బాషా

**బంగారుపాళ్యం, నవంబర్ 6 ప్రభాతవార్త:**



బంగారుపాళ్యం తహసిల్దారుగా షబీర్‌బాష గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసిల్దారుగా విధులు నిర్వహించిన బాబు రాజేంద్రప్రసాద్ ఇటీవల పదవి విరమణ చేశారు. జిల్లా కలెక్టరేట్‌లో లీగల్‌సెల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న షబీర్‌భాషను బంగారుపాళ్యం తహసిల్దారుగా కలెక్టర్ సుమిత్‌కుమార్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. నూతనంగా తహసిల్దారుగా బాధ్యతలు స్వీకరించిన షబీర్‌భాష మాట్లాడుతూ మండల పరిధిలో రెవెన్యూ పరమైన సమస్యలను త్వరితంగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటా మన్నారు. సర్టిఫికేట్ల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చూస్తామన్నారు. అలాగే ప్రజలకు నిత్యవసరాలు పంపిణీ చేసే చౌకదుకాణాలను తనిఖీ చేసి ప్రజలకు వస్తువులు సక్రమంగా అందేలా చూస్తామన్నారు.

## చౌక దుకాణం 32 పై విచారణ

**- తక్కువ స్టాక్ ఉందని నిర్ధారణ**

**కల్లూరు, నవంబర్ 6, ప్రభాతవార్త** పులిచెర్ల మండలం చౌక దుకాణం నెంబర్ 32 పై గురువారం జిల్లా పౌర సరఫరా శాఖ కార్యాలయం నుంచి వచ్చిన అధికారి శ్యాం ప్రసాద్ రెడ్డి విచారణ చేపట్టారు. ఈ దుకాణంలో పూర్తిస్థాయిలో కార్డులకు సదుకులు ఇవ్వడం లేదని, కార్డు దారులు అధికారులకు తెలపడంతో విచారణ చేపట్టారు. విచారణలో దాదాపు 1500 కేజీల బియ్యం, 200 ప్యాకెట్ల చక్కెర తక్కువ ఉన్నట్లు నిర్ధారించారు. ఈ మేరకు నివేదికను జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారికి సమర్పించారు. విచారణ అధికారి వెంట వీఆర్వో ఎల్లప్ప ఉన్నారు.

# తిరుపతి డివిజన్

## శివయ్య సన్నిధిలో హైడ్రా ఛైర్మెన్ పూజలు

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో గురువారం హైడ్రా డైరెక్టర్ రంగనాథ్ కుటుంబసమేతంగా హాజరై పూజలు జరిపించుకున్నారు.ఆయనకు దక్షిణ గోపురం వద్ద ఆలయ మర్యాదలతో ధర్మకర్తల మండలి ఛైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్ స్వాగతం పలికారు. ఆలయంలోని స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను, తీర్థ ప్రసాదాలను ఛైర్మెన్ కొట్టె సాయి అందించారు. ఏర్పాట్లును పర్యవేక్షకులు నాగభూషణం, ఇన్స్పెక్టర్ వెంకటస్వామి,ఎపిఆర్ఓ రవిలు పర్యవేక్షించారు.

## పేట బ్రదర్స్‌చే అన్నదానం

తొట్టంబేడు,నవంబర్ 6 ప్రభాతవార్త



జనసేన నాయకుడు డిప్యూటి సిఎం పవన్‌కళ్యాణ్ ఆదర్శాలకు అనుగుణంగా తొట్టంబేడు మండలానికి చెందిన పేట బ్రదర్స్ కార్యక్రమాలను రూపొందించుకొని అమలు చేస్తున్నారు. ఓ వైపు సామాజిక కార్యక్రమాలు మరో వైపు గ్రామాల్లో సమస్యలపై దృష్టి సారించి నిరుపేద గిరిజన,దళితులకు అండగా ఉంటున్నారు. గురువారం ఆర్‌టిసి బస్టాండు వద్ద నిరుపేదలకు డొక్కాసీతమ్మ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.67వ వారం అన్నదాన కార్యక్రమాలను పేట చంద్రశేఖర్,పేట చిరంజీవి, మణి, నవీన్, ముని చంద్ర, రాజా,చందు, యాసిన్ బాషా, పళనిస్వామి, సాయి,గోపి, వీర మహిళలు బత్తెమ్మ, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఇవి రోడ్లా జారుడు బండలా?



తొట్టంబేడు,నవంబర్ 6 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని గ్రామీణ రోడ్లు అధ్వాన్నంగా మారాయి.మండలంలోని ఆర్‌అండ్‌బి రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మట్టిరోడ్లు జారుడు బండల్లా మారాయి. రహదా రులుమన నాగరికతకు ఆనవాలు అంటారు. మరి తొట్టంబేడు మండలంలోని రోడ్ల పరిస్థితి పరిశీలిస్తే ఏ నాగరికతకు నిదర్శనాలో అర్థం కావటం లేదు.కనపర్తి నుంచి కొత్తకండ్రిగకు వెళ్ళు రోడ్డు పరిస్థితి ఆయనీయంగా మారింది. అసలే బురద రోడ్డు సింగిల్ రోడ్డు కావటంతో ఒక వాహనం వస్తే మరో వాహనానికి దారి ఉండటం లేదు. దాంతో ఎదురుగా వచ్చే వాహనాలు పొలాల్లోకి దిగాల్సి వస్తుంది. ఇక బురదమయంగా మారిన ఈ రోడ్డుపై ద్విచక్రవాహన దారులు వెళ్ళాలంటే జారి పడుతున్నట్లు చెబుతున్నారు.కనీసం మరమ్మత్తులు చేయాలన్నా వర్షం తెరపి ఇవ్వటం లేదు.

## ఇరువర్గాల మధ్య ఘర్షణ: నలుగురికి గాయాలు

తొట్టంబేడు,నవంబర్ 6 ప్రభాతవార్త

తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు అరుంధతి వాడలో ఇరువర్గాల మధ్య ఘర్షణల్లో నలుగురు గాయపడినట్లు డివైయస్‌పి నరసింహారావు తెలిపారు.గురువారం ఆయన అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. అరుంధతి వాడలో కొత్తగా మాతమ్మ ఆలయం నిర్మించారని కుంభాభిషేకం జరుపటానికి చందాల వసూళ్ళ విషయం ప్రారంభించారు.ఈ సందర్భంగా పలు అభిప్రాయాలు వ్యక్త మయ్యాయి. కొందరికి వసూళ్ళ కార్యక్రమాలు నచ్చలేదు. అయితే అందరిని కలుపుకొని వెళ్ళాలని కొందరు అభిప్రాయపడ్డారు. చందాల వసూళ్ళకు సంబంధించిన వాళ్ళు ఏమీ పట్టించుకోకుండా త మ పనిని చేసుకోసాగారు. దాంతో కొందరు నిరాకరించారు.గొడవ పడ్డవారందరూ ఒకే కుటుంబానికి చెందిన దాయాదులే అని వివరించారు.ఈ వివాదాలు ఘర్షణకు దారి తీసింది.ఇరువర్గాలు ఫిర్యాదులు చేయగా ఇరువర్గాలను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపినట్లు డివైయస్‌పి నరసింహామూర్తి తెలిపారు.

## రాయల చెరువును పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త



కెవిబిపురం మండలంలోని కళత్తూరు సమీపంలోని రాయల చెరువు గురువారం గండి పడి ఐదు గ్రామాలు జలమయమయ్యాయి. చెరువు తెగటంతో పాతపాళెం గ్రామానికి తిరుపతిజిల్లా కాంగ్రెస్ నాయకులు బాలగురవంబాబు సారథ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలపా దామోదరంలు బాధితులను పరామర్శించారు. కళత్తూరు దళిత వాడను సందర్శించారు. బాధితులను పరామర్శించారు.గ్రామాల్లో పరిస్థితిదయనీయంగా ఉండటంతో చలించిపోయారు.ఈ పరిశీలనల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు తలపా దామోదర్‌రెడ్డి, వేలురెడ్డి, శబరి రాజన్‌రెడ్డి, కెవిబిపురం మండల పార్టీ అధ్యక్షుడు శివప్రసాద్, పిచ్చాటూరు మండల అధ్యక్షులు తిరుమల సరేంద్రరెడ్డి, ఆంటోని, షణ్ముగం, రమేష్,గోపి, సురేంద్ర, సామ్రాట్, అజిత్, సౌందర్‌రాజన్,సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## దేవస్థానం సిబ్బంది నిజాయితీ

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని దర్శనానికి వచ్చిన హైదరాబాదుకు చెందిన ఉమాదేవి కుటుంబసభ్యులతో వచ్చారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆమె తమ చేతి బ్యాగును పోగొట్టుకున్నారు. ఈ బ్యాగ్‌ను మహిళా సెక్యూరిటి గార్డుకు దొరికింది.ఆమె నిజాయితీతో ఎస్‌పిఎఫ్‌కు అందించారు. వారు ఆలయ పర్యవేక్షకులు నాగభూషణం యాదవ్‌కు తెలిపారు. ఆయన అందులో ఉన్న ఆధారాలను పరిశీలించారు. ఆమె ఫోన్‌కుసచారం అందించారు. ఈ బ్యాగులో రూ.6500లు నగదు, బంగారు నల్లపూసలు, గోలుసు, ఏక కాలగొలుసులున్నట్లుగుర్తించారు.ఆమెకుఅప్పగించారు. ఆలయంలో ఉద్యోగుల నిజాయితిని ప్రసంశించారు.

## ఆకట్టుకుంటున్న సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయం సారథ్యంలో నిర్వహిస్తున్న కార్తీక మాసోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ధూర్జటి కళావేదిక మీద చిన్నారి కళాకారులు సంప్రదాయ నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.ఓ వైపు వర్షం కురుస్తున్నా ఖాతరుచేయక సభికులు వీక్షిం చారు. శ్రీకాళహస్తికి చెందిన నేత్రమనాల్, తిరుపతికి చెందిన యుక్తాశ్రీ,శ్రీకాళహస్తికి చెందిన డి.జయమ్మ నటరాజ్‌లు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

## ఆస్టర్ నారాయణాద్రిలో విజయవంతమైన హెచ్ఐ పిఈసి శస్త్రచికిత్స

– 72 ఏళ్ల మహిళకు తిరిగి జీవితం





**తిరుపతి హెల్త్, నవంబర్ 6 ప్రభాతవార్త:** తిరు పతిలోని ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో అరుదైన వైద్య విజయం నమోదైంది. 72 ఏళ్ల ఓ మహిళకు ఓవరియన్ క్యాన్సర్ కారణంగా ప్రాణాపాయం ఏర్పడగా, ఆస్టర్ నారాయణాద్రి వైద్య బృందం హెచ్ఐపిఈసి అనే ఆధునిక శస్త్రచికిత్స ద్వారా విజయవంతంగా చికిత్స అందించింది. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ సాయికృష్ణ రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐపి ఈసి అనేది అత్యాధునిక క్యాన్సర్ చికిత్సా పద్ధతి. ఇందులో శస్త్రచికిత్స అనంతరం కీమోథెరపీ మందులను వేడి రూపంలో నేరుగా కడుపులో ప్రవేశపెట్టి, మిగిలిన సూక్ష్మ క్యాన్సర్ కణాలను నాశనం చేస్తుంది. ఇది క్యాన్సర్ తిరిగి రావడాన్ని అరికట్టడంలో ఎంతో ప్రభావంతమైన పద్ధతి. వృద్ధాప్యంలో ఇలాంటి సవాళ్లతో కూడిన శాస్త్ర చికిత్సలను, మా సర్జికల్ ఆంకాలజీ , సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ, మెడికల్ ఆంకాలజీ, అనస్థీషియా, క్రిటికల్ కేర్ విభాగాల సమన్వయంతో ఈ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి చేయగలిగాం. ప్రస్తుతం రోగి పూర్తిగా కోలుకున్నారు అని తెలిపారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ హెచ్ఐపిఈసి సర్జరీలను మదర్ సర్జరీ అని పిలుస్తారని ఇది అత్యంత క్లిష్టమైన, ఆధునిక పద్ధతి. దేశంలోని ప్రతి ఆసుపత్రిలో ఈ సదుపాయం అందుబాటులో ఉండదనీ అన్నారు. అయితే పాస్టర్ డిఎం హెల్త్ కేర్ నెట్‌వర్క్ ద్వారా మేము ఇతర ఆస్టర్ ఆసుపత్రుల నుంచి అవసరమైన హైఎండ్ మెషీన్లను తీసుకుని ఇలాంటి శస్త్రచికిత్సలను తిరుపతిలోనే చేయగలుగుతున్నాం. దీని వల్ల రాయలసీమ ప్రజలకు మెట్రో స్థాయి చికిత్స అందుబాటులోకి వచ్చింది అన్నారు. ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రి ఎల్లప్పుడూ అత్యాధునిక వైద్యం అందరికీ అందుబాటులో" అనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. ఈ విజయవంతమైన హెచ్ఐపి ఈసి శస్త్రచికిత్స ఆ దిశలో మరో మైలురాయి అన్నారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ ఆస్టర్ నారాయణాద్రి ఆసుపత్రిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవలే మా ప్రత్యేకత. కొన్ని కేసుల్లో సీఎం రిలీఫ్ ఫండ్, ఇతర పథకాల ద్వారా కూడా రోగులకు సహాయం అందిస్తున్నాం, అత్యుత్తమ వైద్య బృందం, క్రిటికల్ కేర్ విభాగం సమన్వయంతో రాయలసీమలో అన్ని రకాల క్లిష్టమైన కేసులను విజయవంతంగా నిర్వహిస్తున్నాం అని వివరించారు.డా. ఎస్ వి ప్రసాద్, డా. పి. ప్రతిమ, డా. శ్రీకాంత్, ఆసుపత్రి వైద్య బృందం పాల్గొన్నారు.

## స్థానిక వేద పండితులకు అవకాశం కల్పించండి

**తిరుపతి హెల్త్, నవంబర్ 6, ప్రభాతవార్త:** టీటీడీలో త్వరలో భర్తీ కానున్న వేద పండితుల ఉద్యోగాల్లో స్థానిక వేద పండితులకు అవకాశం కల్పించాలని స్థానిక వేద పండిత బృందం ప్రతినిధులు రాజేష్ కుమార్, కృష్ణ ప్రసాద్, సరళ, రవికుమార్ టీటీడీ యాజమాన్యానికి, సీఎం, డిప్యూటీ సీఎంకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తిరుపతి ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. టీటీడీ విద్యాసంస్థల్లో దాదాపు 80 కుటుంబాల బ్రాహ్మణ విద్యార్థులు వేద పండితం నేర్చుకోవడం జరిగిందన్నారు. వీరికి త్వరలో భర్తీ చేసే 700 పోస్టులలో ఈ 80 మంది బ్రాహ్మణ వేద పండితులకు అవకాశం కల్పిస్తారని కోరారు. ఇప్పటికే వీరందరూ టిటిడికి సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని గుర్తు చేశారు.

## అభివృద్ధి చెందింది నియోజకవర్గం కాదు రోజా కుటుంబం

వడమాలపేట, నవంబరు 6 ప్రభాతవార్త:



ఎమ్మెల్యేగా, మంత్రిగా నగరి నియోజకవర్గంలో రోజా చేసినది ఏమీ లేదని కానీ ఆమె కుటుంబం మాత్రం బాగా అభివృద్ధి సాధించిందని వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి విమర్శించారు. గురువారం వడమాలపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వడమాలపేట చాలా ప్రశాంతమైన మండలమని ఇక్కడి ప్రజలు రోజాను రెండు సార్లు మెజారిటీతో గెలిపించారని తెలిపారు. ప్రశాంతంగా ఉన్న మండలంలో చిచ్చుపెడుతుంటే చూస్తూ ఉండమని హెచ్చరించారు. పది సంవత్సరాలు దోచుకోవడం తప్ప ప్రజలకు చేసినది ఏమీ లేదన్నారు. పార్టీ కార్యకర్తలు అనారోగ్యం పాలైతే ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి డబ్బులు తెచ్చి అందులోను పది శాతం కమిషన్ తీసుకున్న చరిత్ర రోజా కుటుంబానిదని విమర్శించారు. నిజాయితీగా నియోజకవర్గం అభివృద్ధికి పాటుపడుతున్న భానుప్రకాష్‌ని విమర్శించే అర్హత ఆమెకు ఎక్కడిదన్నారు.

## బీసీ హాస్టల్‌ని పరిశీలించిన ఆర్డీవో అనుపమ

విజయపురం, నవంబరు 6 ప్రభాతవార్త:

మండలంలోని విజయపురంలో బీసీ హాస్టల్‌ని ఆర్డీవో అనుపమ గురువారం పరిశీలించారు. హాస్టల్ విద్యార్థుల సౌకర్యార్థం మరుగుదొడ్లలో గ్రీజర్లు, పెయింటింగ్, మరమ్మతు పనులను పర్యవేక్షించారు. అనంతరం విజయపురం దళితవాడ ఓవర్‌హెడ్ ట్యాం కును, అంబగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. విజ యపురం తహసీల్దార్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌పై అధికారులతో వివరాలు అడిగి తెలుసుకున్నారు. పీజీఆర్‌ఎస్‌లోని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ కిరణ్, డీటీ అశోక్, ఇన్‌చార్జి వార్డెన్ చంద్రబాబు, నాయకులు రమేష్‌రాజు, బాలసుబ్రహ్మణ్యం రాజు, బాబుయాదవ్ పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వైసీపీ నేతలకు పరామర్శ

పాకాల, నవంబర్ 6, ప్రభాతవార్త



పాకాల మండలంకు చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వారిని చంద్రగిరి నియోజక వర్గం పార్టీ ఇన్ చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి గురువారం రోజున పరామర్శించారు. బందార్లపల్లికి చెందిన ఎ.కుమార స్వామి రెడ్డి, పాకాల పట్టణం కు చెందిన ఎం.యోగానంద చౌదరిలు ప్రమాదంలో గాయపడి చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటు ఉండగా వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆ ఇద్దరిని పరామర్శించిన వారిలో స్థానిక పార్టీ నేతలు కూడా వున్నారు.

## నవంబర్ చివరి కెల్లా 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలి

పాకాల, నవంబర్ 6, ప్రభాతవార్త



నవంబర్ చివరి కెల్లా 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ పూర్తి చేయాలని పాకాల మండల విద్యా శాఖాధికారి బాబ్జి అన్నారు. గురువారం దామల చెరువు, మొగరాల ఉన్నత పాఠశాల నందు ఉపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల చివరి కెల్లా 10వ తరగతి విద్యార్థులకు సిలబస్ కంప్లీట్ చేసి తదుపరి విద్యార్థులను వారి వారి స్థాయి తగ్గట్టు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. చదువులో వెనుక బడిన విద్యార్థుల కోసం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులు బాగా చదువులు చెప్పి మండలానికి మంచి పేరు తీసుకొని రావాలని కోరారు. ఆదివారం 10వ తరగతి విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. విద్యార్థులకు ప్రతి రోజు స్లిప్ టెస్ట్ నిర్వహించి వారు ఎక్కడ వెనక బడి ఉన్నారో దానిని సరిచేయలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుమతమ్మ, సుమలత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యస్వీయూ పరిధిలో డిగ్రీ పరీక్షల ఫీజు గడువు

తిరుపతి విద్య, నవంబర్ 6 ప్రభాత వార్త:

శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మూడవ,ఐదవ సెమిస్టర్ పరీక్షలకు ఫీజు చెల్లింపు ప్రక్రియ మొదలైనట్లు యస్వీయూ పరీక్షల నియంత్రణాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా రెండు సెమిస్టర్లలో పరీక్ష రాయదలచిన విద్యార్థులు నవంబర్ 14 వ తేదీ లోపు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా,నవంబర్ 18 వరకు అపరాధ రుసుముతో పరీక్ష ఫీజు చెల్లించాల్సి వుంటుందని తెలిపారు.కావున విద్యార్థులు సంబంధిత కళాశాలలో పరీక్ష ఫీజులు చెల్లించి నమోదు చేసుకోవాలని విశ్వ విద్యాలయం పరీక్షల అధికారి తెలిపారు.

## ఏర్పేడు మండలంలో సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణి

శ్రీకాళహస్తిరూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త



ఏర్పేడు మండలంలోని పలు గ్రామాల్లో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేసిన చెక్కులను శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మ గురువారం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణంగా సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎక్కడో ఒక చోట అందించే సంప్రదాయం ఉందని కానీ తాము దానికి బిన్నంగా ఓ పద్ధతిని ఎంచుకు న్నామన్నారు.బాధితుల ఇళ్ళ వద్దకు వెళ్ళి వారి క్షేమ సమాచారాలను తెలుసుకొని అందజే స్తున్నట్లు బృందమ్మ వివరించారు. ఇదో ఆకర్షణీయంగా ఉందన్నారు. వివిధ గ్రామాలకు సంబంధించిన బాధితుల వివరాలు ఇలా ఉన్నాయి.జి.మునికృష్ణయ్య(పంగూరు), ఈశ్వరయ్య(చిందేపల్లి), కె.నరసింహులు( సీతారాం పేట),హేమాద్రి (ఇసుక తాగేలి),మోహన్ కృష్ణ(పాతవీరాపురం) జయరాం మొదలియార్ (గుడిమల్లం) డి.శరత్‌కుమార్( మునగలపాళం),రాజేశ్వరి (గోవిందవరం), కిరణ్‌మయి (చెల్లూరు), వై.రామ చంద్ర (ముసలిపేడు)లకు రూ.13,12,731ల చెక్కులను బృందమ్మ అందించారు.ఈ కార్యక్రమాల్లో మండలపార్టీ అధ్యక్షుడు నాగరాజనాయుడు,తెలుగుదేశం నాయకులు చెంచయ్యనాయుడు, మహేష్‌రెడ్డి, మనోహర్‌నాయుడు,భూపతినాయుడు కార్యకర్తలు పేర్కొన్నారు.

## పాఠశాల బస్సులను కండిషన్‌లో పెట్టుకోవాలి!

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త



విద్యార్థుల భద్రత దృష్ట్యా ప్రతిపాఠశాల బస్సును నిర్వాహకులు కండిషన్‌లో పెట్టుకోవాలని మోటార్ వాహన తనిఖీ అధికారి దామదర్‌నాయుడు అన్నారు. గురువారం శ్రీకాళహస్తి పరిధిలోని పాఠశాలలు, కళాశాలల కరస్పాండెంట్లు,ప్రిన్సిపాల్స్‌తో తన కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు చోటు చేసుకున్న సంఘటనల దృష్ట్యా ప్రతి బస్సును తనిఖీ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు.కొత్త బస్సులకు ఫైర్ అలారం సిస్టం మరియు ఫైర్ ప్రొటెక్షన్ సిస్టం ఏర్పాటు చేసి ఉండాలని ఆయన సూచించారు. 2019 కంటే పాత వాహనాలకు ఈ సిస్టం అవసరం లేదన్నారు. కానీ అన్ని బస్సులకు రెండు అగ్నిమాపక యంత్రాలు మరియు అత్యవసర ద్వారాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు సంభవించినపుడు అద్దాలద్వారం పగులగొట్టి బయటకు రావటానికి డైమండ్ ఎడ్జ్‌హేమర్ ప్రతి వాహనాంలో అమర్చాలని ఆయన సూచించారు.

## రోడ్లపై నిర్మాణాలను సహించం : కమిషనర్

శ్రీకాళహస్తి,నవంబర్ 6 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి సమీపంలోని బూడిదమిట్టలో అక్రమ ఆక్రమణలను ఉపేక్షించేది లేదని మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్ అన్నారు. ఈ నేపథ్యంలో బూడిదమిట్టలో ఓ కట్టడాన్ని కూల్చివేసినట్లు వివరించారు. బూడిద మిట్టలోని సర్వేనెంబర్ 352లో డోర్ నెంబర్ 4-235లో ఆర్‌డి శ్రీధర్ అనధికారికంగా రోడ్డు కడ్డంగా ఓ భవనాన్ని నిర్మించి రాకపోకలకు అంతరాయం కల్గించినట్లు తమకు ఫిర్యాదులు అందాయన్నారు. ఈమేరకు పరిశీలించిన తరువాత ఆ నిర్మాణం అక్రమ కట్టడమని తేలిందన్నారు. కాలువలను ఆక్రమించి ఇబ్బంది కల్గించినందున తొలగింపుకు ఆదేశించినట్లు తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ ప్రణాళికా విభాగం అధికారులు భవనాన్ని తొలగించినట్లు వివరించారు.

## అర్ధనారీశ్వరాలయం సంప్రోక్షణ

తొట్టంబేడు,నవంబర్ 6 ప్రభాతవార్త



పవిత్రమైన అర్ధనారీశ్వరాలయాన్ని వైకాపా నాయకులు అపవిత్రం చేసారని గురువారం తెలుగుదేశం నాయకులు 'సంప్రోక్షణ' గావించారు. ఆయన అవాస్తవాలతో ప్రజలను తప్పుదారి పట్టించారని ఆరోపించారు. దేవాలయాన్ని గోమూత్రం, పసుపు నీటితో సంప్రోక్షణ గావించారు. బాధ్యత కల్గిన మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి ఆలయ పవిత్రతను దెబ్బతీసేవిధంగా వ్యవహారించారన్నారు. భక్తులను మానసికంగా కృంగదీసేవిధంగా దేవాలయానికి వెళ్ళకుండా చేయటానికి కుట్ర చేయటం దారుణమన్నారు. తెలుగుదేశం, బిజెపి వేర్వేరుగా మీడియా సమావేశాలు ఏర్పాటు చేసి వైకాపా నాయకుల కుట్రలను తిప్పికొట్టారు.బియ్యపు మధుసూధనరెడ్డి వారి సహచరుల రాకతో ఆలయం పరిసరాలు అపరిశుభ్రమయ్యాయన్నారు. అందుకే ఈ శుద్ది కార్యక్రమాలు అన్నారు. ఈ కార్యక్రమాల్లో పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, ట్రస్టుబోర్డు సభ్యులు గాదిపాకుల గోపినాథ్, టౌన్‌బ్యాంకు ఛైర్మెన్ ఖాదర్‌బాషా, జనసేన నాయకులు కవిత,సుబ్బయ్య,షాకిర్ అలి, రామానాయుడు, ఆస్మత్ మునిరాజాయాదవ్, వివేక్, చాన్‌బాషా,పోలూరు శ్రీనివాసులు,దొరబాబు, ప్రతాప్‌రెడ్డి,సన్నీ, షఫీ, కరీం, షఫీబాయ్, రుకేష్ జహీర్ అహ్మద్ ఢిల్లి బాబు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ తగదు..!



విద్యార్థుల భవిష్యత్తుకై ఒక సంతకం పెట్టండి..! వైఎస్ఆర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

**రామచంద్రాపురం, నవంబర్ 6 ప్రభాతవార్త:** వైద్య కళాశాలలు ప్రైవేటీకరణ తగదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి అన్నారు. గురువారం నడవలూరు గ్రామంలో కోటి సంతకాల కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భావిభారత పౌరులైన విద్యార్థుల భవిష్యత్తు కోసం చంద్రబాబు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ రద్దు చేస్తూ ఒక సంతకం పెట్టాలని డిమాండ్ చేశారు. పేద విద్యార్థులకు వైద్య విద్యను అందించడం కోసం గత ప్రభుత్వం ప్రభుత్వ వైద్య కళాశాలలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై వైద్య కళాశాలలను ప్రైవేటీకరించడానికి ముమ్మరంగా కృషి చేస్తుందని దుయ్యబట్టారు. ప్రైవేటీకరణను నిలువరించడానికి ఆందోళన చేయడానికి వెనుకంజ వేయబోమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు ఎద్దల చంద్రశేఖర్ రెడ్డి, ఎంపిపి ఏవి బ్రహ్మానందరెడ్డి, సర్పంచ్‌లు గణపతి రెడ్డి, మురగయ్య, హిమాల్ రెడ్డి, నాయకులు గిరిధర్ రెడ్డి, గోపి చౌదరి, యశ్వంత్ రెడ్డి, నెల్లేపల్లి వెంకటేష్, లావణ్య చంద్రబాబు, నిరంజన రెడ్డి, సతీష్ రెడ్డి, ఇరగం రెడ్డి, చిరంజీవులు నాయుడు, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

## గెరిగ గుండుపై కార్తీక దీపం



**రామచంద్రాపురం, నవంబర్ 6 ప్రభాతవార్త:** కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని నెత్తకుప్పం సమీప అటవీప్రాంతంలో వెలసియున్న గెరిగ గుండుపై బుధ వారం రాత్రి నెత్తకుప్పం గ్రామస్థులు అత్యంత భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన వ్యయప్రయాసలతో కూడిన అటవీ ప్రాంతం లో సుమారు 6 కిలోమీటర్లు కాలినడకన ప్రయాణించి గుండుపైకి గుండుపై వెలసియున్న శివుడికి సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దీపాన్ని వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. గుండుపైకి చేరుకున్న యువతకు టిడిపి జిల్లా కార్యదర్శి జెడి జగన్ తీర్థప్రసాదాలు అందజేశారు.

## రైతులకు సబ్సీడి పథకం ద్వారా వేరుశెనగకాయలు పంపిణీ

నారాయణవనం, అక్టోబర్ 6 ప్రభాతవార్త :



ఖరీఫ్ సీజన్‌ని దృష్టిలో వుంచుకొని కూటమి ప్రభుత్వం రైతులకు ముందుగానే సబ్సీడి క్రింద వేరుశెనగకాయలను అందించడం జరుగుతుందని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. గురువారం మండలంలోని అరణ్యకండ్రిగ పంచాయతీ గోవిందప్పనాయుడుకండ్రిగ రైతుసేవాకేంద్రంలో రైతులకు వేరుశెనగకాయలను సర్పంచ్ మురళి అధ్యక్షతన అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో ముందుంటుందన్నారు. ఈ ఏడాది వర్షాలు విస్తరంగా కురవడంతో చెరువులకు నీళ్లు చేరుతోందన్నారు. రైతులు కూడా పంట సాగు చేయడానికి సిద్ధంగా వుండడంతో వారికి ముందుగానే అందుబాటులో వేరుశెనగకాయలను వుంచడంతో రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యాశాఖ కార్యాలయాన్ని తనిఖీ చేసిన జిల్లా అధికారలు

నారాయణవనం, అక్టోబర్ 6 ప్రభాతవార్త :



నారాయణవనం మండలం విద్యాశాఖ కార్యాలయాన్ని జిల్లా సెక్టోరియల్ ఆఫీసర్ కె సారధి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు హోలోస్టిక్ కార్డు(ప్రొగ్రాస్ కార్డు)లను అందజేశారు. ఇప్పటికే విద్యార్థులకు ఈ కార్డులను అందించడం జరిగిందని, కొత్తగా పాఠశాలలో చేరిన మిగిలిన విద్యార్థులకు సంబందించిన కార్డులను కూడా అందించడం జరిగిందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అర్థం చేసుకొనే రీతిలో చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ కోదండనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినిలు చదువుతో పాటు ఆటల పోటీలలో కూడా రాణించాలి



- ప్రిన్సిపాల్ నారాయణమ్మ

తిరుపతి విద్య, నవంబర్ 6 ప్రభాత వార్త

శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ,పీజీ కళాశాల విద్యార్థినిలు శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు నిర్వహించిన అంతర కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ నందు పాల్గొని గేమ్స్ నందు ఓవరాల్ ఛాంపియన్‌షిప్,నగదు బహుమతి రూ.30000, అథ్లెటిక్స్ నందు ఓవరాల్ ఛాంపియన్‌షిప్, నగదు బహుమతి రూ 30000,అథ్లెటిక్స్ వ్యక్తిగత ఛాంపియన్‌షిప్ గాను నగదు బహుమతి రూ 3000 అందుకున్నారు.ఈ సందర్భంగా జరిగిన అభినందన సభలో కళాశాల ప్రిన్సిపల్ డా. తిరుమల నారాయణమ్మ మాట్లాడుతూ మూడు విభాగాలందు విద్యార్థినిలు ఛాంపియన్‌షిప్ సాధించడం అభినందనీయం అన్నారు.విద్యార్థినిలు 4వ తేదీ జరిగిన అథ్లెటిక్స్ 100 మీటర్లు, 200 మీటర్లు,400 మీటర్లు,800 మీటర్లు, 1500 మీటర్లు,100 మీటర్లు హార్డిల్స్,లాంగ్ జంప్, జావ్లిన్ త్రో,డిస్కస్ త్రో, షాట్ పుట్, 4x100 మీటర్లు,4x400 మీటర్లు రిలే నందు పాల్గొన్నారు. ఈ విధంగా కళాశాల విద్యార్థినిలు చదువుతోపాటు ఆటలపోటీలలో పాల్గొని విజయాన్ని సాధించడం కళాశాలకు,టీటీడీ సంస్థకు గర్వకారణం అని అన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్ (ఇన్చార్జి) విభాగాధిపతి డా బి భారతి,సైకాలజీ విభాగాధిపతి డా జి భద్రమణి,పద్మశ్రీ,విద్యార్థినిలు పాల్గొన్నారు.

## రెక్టార్ ను కలిసిన నారాయణ గౌడ్

తిరుపతి విద్య, నవంబర్ 6 ప్రభాత వార్త:



ఎస్ వి యూనివర్సిటీ రెక్టార్ గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య సిహెచ్ అప్పారావును ఆంధ్రప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు.నారాయణ గౌడ్ మాట్లాడుతూ స్నేహశీలి, మృదుస్వభావి ,చిరునవ్వుతో పలకరించే గొప్ప విద్యావేత్త గతంలో డి ఓ ఏ డైరెక్టర్,సి డి సి డీన్,15 నెలలు ఇన్చార్జి వైస్ ఛాన్సలర్ పాలనలో ఎటువంటి అవినీతి మరకలు లేకుండా అకాడమిక్ పరంగా యూనివర్సిటీని ముందుకు నడిపి ముఖ్యంగా ఎటువంటి ఫెలోషిప్లు లేని పరిశోధక విద్యార్థులకు నెలకు 5000 రూపాయలు కేటాయించినటువంటి వ్యక్తి ప్రొఫెసర్ అప్పారావు అని తెలిపారు.రెక్టార్ ను కలిసిన వారిలో వినయ్, బాలమురళి గౌడ్, గంగాధర్ ,లోకేష్,శివ,గిరి,కాలేషా,మునిస్వామి తదితరులు ఉన్నారు.

## శ్రీచైతన్య విద్యా సంస్థలలో రక్తదాన శిబిరం

తిరుపతి విద్య, నవంబర్ 6 ప్రభాత వార్త:



శ్రీ చైతన్య విద్యా సంస్థల చైర్ పర్సన్ డాక్టర్ ఝాన్సీ లక్ష్మీబాయి 76 వ జన్మదిన సందర్భంగా తిరుపతి శ్రీ చైతన్య విద్యా సంస్థలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు.మన రక్తం మరొకరి ప్రాణం కాపాడుతుందనే విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని ఆయన సూచించారు. అందుకోసం ఎప్పుడు అవకాశం వచ్చినా రక్తదానం చేసేందుకు యువత ఉత్సాహంగా ముందుకు రావాలని స్పష్టం చేశారు. కాలేజీ,స్కూల్ ఏజీఎం లు ఝాన్సీ లక్ష్మీబాయి సామాజిక,ఆధ్యాత్మిక సేవల గురించి కొనియాడారు.అనేక మంది అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది రక్తదాన శిబిరంలో విరివిగా పాల్గొని రక్త దానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో శ్రీ చైతన్య కాలేజీల ఏజీఎం బివి ప్రసాద్,స్కూల్స్ ఏజీఎం సురేష్,విద్యాసంస్థల డీన్లు,ప్రిన్సిపాల్స్,అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు

మెయిన్ అంగన్‌వాడీ కార్యకర్తలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు



**పుత్తూరు రూరల్, నవంబరు 6 ప్రభాతవార్త:** పుత్తూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని మినీ అంగ న్‌వాడీ కార్యకర్తలకు మెయిన్ అంగన్ వాడీ కార్య కర్తలుగా అప్‌గ్రేడ్‌చేస్తూ ఉత్తర్వులు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అందించారు. పుత్తూరు మండలం నుంచి బీడీ కాలనీ ఏ.అన్నపూర్ణ, మంచి నీళ్ళగుంట పి.నీరజ, ద్వారకానగర్ టి.సుమతి, వడమాలపేట మండలం నుంచి బాలినాయుడు కండ్రిగ బి.పూర్ణ, అప్పలాయగుంట వడ్డిపల్లి వి.రాజేశ్వరి, వడమాల వడ్డిపల్లి బి.డిల్లెమ్మలకు ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ గురువారం ఆరుగురు మినీ అంగన్‌వాడీ కార్యకర్తలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడం జరిగింది. ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో సంధ్య, అంగన్‌వాడీ యూనియన్ లీడర్లు విజయకుమారి, మునికుమారి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

# సర్వసభ్య సమావేశంలో రగడ

**- అధికారులు తీరుపై అసహనం వ్యక్తం చేసిన సర్పంచులు**
**- ఉన్నోడికి ఒక న్యాయం పేదోడికో న్యాయమా**

దొరవారిసత్రం, నవంబర్ 6 ప్రభాతవార్త: మండల పరిధిలోని ఎంపీడీవో కార్యాలయం నందు గురువారం సర్వ సభ సమావేశాన్ని మండల అధ్యక్షరాలు దువ్వూరు సుజాతమ్మ ఆధీనంలో ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో చర్చించారు. ముఖ్యంగా అధికారుల పనితీరుపై సర్పంచులు ఆందోళన వ్యక్తం చేశారు. సకాలంలో రైతులకు అందించాల్సిన యూరియా అందించ లేకపోతున్నారని అక్కరపాక సర్పంచ్ కామిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అధికారులను నిలదీశారు. మండల సమీపంలోని నెల్లూరుపల్లి ప్రభుత్వ భూములను పేదవారు వ్యవసాయం చేసుకుంటుంటే రైతులను కాలవలు తవ్వేశారు. ఇబ్బంది పెట్టారు అయితే నెల బల్లి సమీపంలో ఉన్న




కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూమిని బడా నాయకులు కబ్జా చేస్తుంటే ఈ రెవెన్యూ అధికారులు చెవుటోడి చెవులు చంక ముందునట్లుగానే వ్యవహ రిస్తున్నారని సర్పంచులు ఆరోపించారు. ఈ ధర్మ సత్రం మండలంలో కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతున్న పట్టించుకోవడం లేదని కొందరు ఆరోపించారు. రగడతో మొదలైన సర్వసభ్య సమావేశం రగడగానే ముగిసింది. ఈ కార్యక్రమానికి మండల ఎంపీడీవో గోవర్ధన్, మండల ఉపాధ్యక్షులు దువ్వూరు గోపాల్‌రెడ్డి, రెవెన్యూ అధికారులు సెక్రటరీలు సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, గోపిరెడ్డి మధురెడ్డి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నాలు!



డక్కిలి, నవంబరు 6 ప్రభాతవార్త : డక్కిలి మండలంలోని నమశ్శియాపురం సర్వే నెంబరు1లో సుమారు 227 ఎకరాలు ప్రభుత్వ భూమిని కొంత మంది నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్ని స్తున్నారని ఏఈ ప్రజాసంఘాల ఐక్యవేదిక ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కన్వీనరు గద్దల మునెయ్య తెలిపారు. గురువారం ఆయన స్థానిక తహశీల్దారు కార్యాల యంలో డిప్యూటి తహశీల్దారు ప్రసన్నకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎఫ్ఎల్ఆర్ ప్రకారం సదరు భూమి 1958లో పశువుల మేత పోరంబోకు భూమిగా ఉందని, తరువాత 1978 సంవత్సరంలో సెటిల్‌మెంటు అధికారులు ఈ భూమిని ప్రభుత్వ భూమిగా మార్చారు వివరించారు.ఆ భూముల్లో వనసంరక్షణ సమితిల్లో ద్వారాజామాయిల్ మొక్కలు కూడా పెంచి ఇటీవల విక్రయించారని తెలిపారు. ప్రస్తుతం ఆభూములు కొంత మంది నాయకులు ప్రభుత్వ భూములను అక్రమ మార్గంలో స్వాధీనం చేసుకునేందుకు ఇటీవల వారు హైకోర్టును ఆశ్రయించి తమ పేరుతో రెవెన్యూ రికార్డులు మార్చుకునేందుకు పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. ఈకార్యక్రమంలో నాయకులు కరెపం శీనయ్య, రమణయ్య, నన్నెం మునెయ్య, చెంచుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త: లయన్స్ క్లబ్ ఆఫ్ సూళ్లూరుపేట షార్ వారి ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. చెంగాళమాత పరమేశ్వరి దేవస్థానం అర్చకులు ముళ్లపూడి హరికుమార్ శర్మ కుమారుడు కృష్ణసంజయ్ శర్మ జన్మదినం సందర్భంగా ఈ అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా రీజియన్ సెక్రటరీ డాక్టర్ ఆదిశేషారెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు లలిత, అరుణకుమారి, రఘురాంరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డాక్టర్ అప్పారావు, హరీష్, మురళీధర్, శ్రీనివాసరావు, భారతి, వసుంధర, శ్రీనివాసులు జెట్టి, అంకుల్‌రావు, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




## రిటైర్డ్ ఎంప్లాయీస్ సమస్యలు పరిష్కరించండి




సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త: ఇస్రో రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 10వ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం గురువారం శ్రీహరికోటలో జరిగింది. ఈ సమావేశానికి షార్ డైరెక్టర్ ఇఎస్ పద్మకుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఇస్రో రిటైర్డ్ ఉద్యోగులు తమ సమస్యలను సానుభూతి తో పరిశీలించాలని షార్ డైరెక్టర్‌కు విన్నవించారు. ఈ కార్యక్రమంలో ఇస్రో రిటైర్డ్ ఎంప్లాయీస్ అధ్యక్షులు జాన్సన్ ఫెర్నాండెజ్, ప్రధాన కార్యదర్శి పరంధామన్ తదితరులు పాల్గొన్నారు.

## సదుపాయాల కల్పన లక్ష్యంగా పని చేయాలి : ఎంపిపి

సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త: గ్రామీణ ప్రాంతాల్లోని సర్పంచులు, ఎంపిటిసిలు ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంగా పని చేయా లని సూళ్లూరుపేట ఎంపిపి అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. గురువారం డివిజినల్ లెవ్ ఓరియంటేషన్ ప్రోగ్రాంలో భాగంగా లోకలైజేషన్ ఆఫ్ సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ అనే అంశంపై స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో రెండురోజులు పాటు సర్పంచులకు, ఎంపిటిసిలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ మురళీ తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త: నెల్లూరు జిల్లా దగదర్తి పర్యటనకు వచ్చిన రాష్ట్రమంత్రి నారా లోకేష్‌ను సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ గురువారం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. దివంగత టిడిపి నేత మాలేపాటి సుబ్బానాయుడుకు నివాళి అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన నారా లోకేష్‌ను ఆమె కలిసి నియోజకవర్గ సమస్యలపై చర్చించారు. అనంతరం మాలేపాటి సుబ్బనాయుడు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## కాళంగి పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సూళ్లూరుపేట, నవంబర్ 6 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కెవిబిపురం మండలం కొల్లూరు రాయల్ చెరువుకు గండి పడటంతో ఆ నీరు చుట్టుపక్కల ప్రాంతాలను ముంపునకు గురిచేసింది. ఈ నేపథ్యంలో ఆ నీరు కాళంగి డ్యామ్‌లోకి చేరుకోవడంతో డ్యామ్‌కు ఉన్న 21 గేట్లలో ఆరు గేట్లను అత్యవసరంగా లేపి నీటిని విడుదల చేశారు. దీంతో సూళ్లూరుపేట పట్టణ పరిధిలోని కాళంగి పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఆర్డీఓ కిరణ్మయి నేతృత్వంలో సిఐ మురళీకృష్ణ, తహశీల్దార్ గోపీనాథ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, ఎస్ఐ బ్రహ్మనాయుడులు లోతట్టు ప్రాంతాలకు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో సమాచారం అందించాలని కోరారు.

## పుత్తూరు ఐటీసీ కంపెనీలో షార్ట్ సర్క్యూట్

**మంటల్లో 10లక్షల మేర ఆస్తి దగ్ధం**



పుత్తూరు రూరల్, నవంబరు 6 ప్రభాతవార్త: పుత్తూరు పట్టణంలోని కాపువీధిలో ఉన్న ఐటీసీ కంపెనీ గోదాములో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణం గా గోదాము ఒక్కసారిగా మంటలు చెల రేగింది. మంటల్లో చాక్లెట్లు, సిగరెట్లు గోధుమ పిండి తదితరవస్తువులు పూర్తిగా దగ్ధమయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న పుత్తూరు అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ఘటనలో సుమారు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం జరిగిందని ఐటీసీ డీలర్ రాఘవ గుప్తా తెలిపారు. అదృష్టవశాత్తు ప్రాణ నష్టం జరగలేదు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

## వడ్రాంపల్లె వద్ద చిరుత పులి దాడిలో దూడ మృతి

కాణిపాకం, నవంబర్ 6 ప్రభాతవార్త: చిరుతపులి దాడి చేసి దూడను చంపి తిన్న సంఘటన బుధవారం రాత్రి కాణిపాకం పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐరాల మండలం వడ్రాంపల్లె గ్రామ సమీపంలో జరిగింది. స్థానికుల కథనం మేరకు వడ్రాంపల్లెకు చెందిన ఎం.కిషోర్‌కుమార్ అనే పాడి రైతు తమ పాడి ఆవులను తన వ్యవసాయ పొలం వద్ద కట్టి వుంచుతుంటారు. పగలు అక్కడ వుంచి మేత వేసిన అనంతరం రాత్రి దూడలను మాత్రం అక్కడే కట్టి వుంచి ఆవులను ఇంటివద్దకు తోలుకెళుతుంటారు. ఈమేరకు బుధ వారం నాలుగు దూడలను వ్యవసాయ బావి వద్దనే కట్టివేసి ఇంటి వచ్చారు. ఈనేపథ్యంలో సమీపం లోని గుట్ట నుండి వచ్చిన చిరుత పులి దూడ మీద దాడి చేసి చంపినట్లు బాధిత రైతు తెలిపారు. బాధిత రైతు ఈ విషయాన్ని గురువారం ఉదయం గుర్తించి మండల, అటవీశాఖ అధికారులకు తెలియజేశారు. దీనితో మండల డిప్యూటి రేంజ్ ఆఫీసర్ కరన్‌సింగ్, ఎఫ్‌బిఓ రెడ్డెప్ప, ఏబిఓ ఉదయ్‌కుమార్‌లు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. చిరుతపులి సంచరిస్తున్నట్లు తెలియడంతో తవణంపల్లె, ఐరాల మండలాలకు చెందిన ప్రజలు తీవ్ర భయాదందోళన చెందుతున్నారు.



## టిటిడి ఈఓను కలసి టిడిపి నేతలు



తిరుపతి, నవంబర్ 6ప్రభాతవార్త: టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్‌ను గురువారం ఉదయం టిడిపి నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈఓ పుట్టినరోజు సందర్భంగా టిడిపి రాష్ట్ర నేతలు డాక్టర్ కోడూరు బాలసుబ్రమణ్యం, బుల్లెట్‌రమణ, పెరుమాళ్ మధు శుభాకాంక్షలు తెలిపారు. పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువతో సన్మానించారు.

## తెరుచుకోని రైతు భరోసా కేంద్రం

ఓజిలి, నవంబర్ 6 ప్రభాతవార్త : మండలంలోని చిలమానుచేను గ్రామంలోని రైతు భరోసా కేంద్రం తెరుచుకోకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. నెలల తరబడి రైతు భరోసా కేంద్రాన్ని మూసి ఉన్నట్లు రైతులు విమర్శిస్తున్నారు. మండల వ్యవసాయా ధికారి నిర్లక్ష్యం కారణంగానే రైతులకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు చెప్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రైతు భరోసా కేంద్రాన్ని తెరిపించి రైతులకు ప్రభుత్వ రాయితీలు అందించే ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.




## గౌతమ్‌రెడ్డిపై దాడి... ప్రజాస్వామ్యంపై దాడి

శ్రీసిటీ (తడ), నవంబర్ 6 ప్రభాతవార్త : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ట్రేడ్ యూనియన్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పూనూరు గౌతమ్‌రెడ్డి కారుకు నిప్పు పెట్టిన ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ఘటనను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి నెల్లూరు జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు బోలింగాలపాడు జయకుమార్‌రెడ్డి గురువారం తడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఖండించారు. ప్రజల కోసం నిస్వార్థంగా పనిచేస్తున్న నాయకులపై ఇలాంటి దాడులు జరగడం ప్రజాస్వామ్యానికి మచ్చ అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు వేగవంతం చేసి నిందితుడికి కఠిన శిక్ష విధించాలని డిమాండ్ చేశారు

## వెంకటగిరి రెవిన్యూ డివిజన్‌గా చేయాలి:డీసీఎంఎస్ చైర్మన్

వెంకటగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త : ఎంతో చరిత్ర కలిగిన వెంకటగిరిని వేణు డివిజన్‌గా చేయాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర టిడిపి కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు తెలిపారు. వెంకటగిరిని, శ్రీకాళహస్తికానీ, గూడూరులో కలపరాదని తెలిపారు. నియోజకవర్గంలోని మొత్తం మండలాలను కలిపి రెవిన్యూ డివిజన్ చేయాలని కోరారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ వెంకటగిరి రెవిన్యూ డివిజన్ చేయాలని మంత్రివర్గ సబ్ కమిటీ కూడా చెప్పారని తెలిపారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలు కూడా రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. అవసరమైతే సీఎం దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్తామని తెలిపారు.

## ఆగ్రో ఇండస్ట్రీ చైర్మన్ మృతి టిడిపికి తీరని లోటు : ఎమ్మెల్సీ

వెంకటగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ మాలేపాటి సుబ్బానాయుడు మృతి తెలుగు దేశం పార్టీకి తీరని లోటు అని ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి తెలిపారు. కుటుంబ సభ్యులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐ.టీ ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, రియల్ టైమ్ గవర్నెన్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌తో కలిసి మాలేపాటి సుబ్బానాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి సుబ్బానాయుడు ఎంతగానో కృషి చేశారని తెలిపారు.

## వెంకటగిరిని రెవెన్యూ డివిజన్ చేయాలి

వెంకటగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త: రెవెన్యూ డివిజన్ వెంకటగిరి చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ రెవెన్యూ డివిజన్ వెంకటగిరి చేసేందుకు అన్ని అర్హతలు ఉన్నాయని నవజీవన్ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక చైర్మన్ కె.సహదేవయ్య తెలిపారు. వెంకటగిరిలోని తెలుగు గంగ అతిథి గృహంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటగిరి, డక్కిలి, బాలాయపల్లి మండలాలను కలిపి రెవెన్యూ డివిజన్ చేయవచ్చునని తెలిపారు. ఎమ్మెల్యే కొరుకొండ రామకృష్ణ, వైసీపీ నేత రామ్ కుమార్ రెడ్డి కూడా రెవెన్యూ డివిజన్ చేయాలని కోరుతున్నట్లు తెలిపారు.

## పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ఎంపీ

వెంకటగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త: ఢిల్లీలో జరుగుతున్న పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో ఎంపీ గురుమూర్తి పాల్గొన్నారు. ఒళ్ళూరు రాయలచెరువు తెగిపోవడంపై ఢిల్లీ నుండి ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణ సహాయక చర్యలకు రూ.20 లక్షల ఎంపీ నిధులు విడుదల చేసినట్టు ప్రకటించారు. సత్యవేడు నియోజకవర్గంలోని కేవీబీపురం మండలం ఒళ్ళూరు , రాయల చెరువు తెగిపోవడంతో పరిసర గ్రామాలైన కళత్తూరు, కలత్తూరు హరిజనవాడ, పాతపాలెం గ్రామాలు నీట మునిగినట్లు ఆందోళన చెందారు. ప్రస్తుతం పార్లమెంటు స్టాండింగ్ కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు డిల్లీలో ఉన్న ఎంపీ వెంటనే స్పందించారు.తిరుపతి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిస్థితిని తెలుసుకున్నారు. కలెక్టర్‌కి తగిన సహాయక చర్యలు తక్షణమే చేపట్టాలని సూచించారు. స్థానిక ఆర్డీవోతో కూడా మాట్లాడినట్లు చెప్పారు. తక్షణ సహాయక చర్యలకుగాను ఎంపీ నిధుల నుండి రూ.20లక్షలు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

## భక్తులకు దర్శనం ఇచ్చిన అయ్యప్ప స్వామి



వెంకటగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త: కొండదొర అలంకరణలో కుమ్మరిగుంట పుష్కరణ వద్ద ఉన్న అయ్యప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక మాసంలో భాగంగా అయ్యప్ప స్వామికి కొండ దొర అలంకరణ చేశారు. కమల్ స్వామి అయ్యప్పకు అలంకరణ చేశారు. మాలాధారంలో ఉన్న భక్తులు ప్రత్యేక భజనలు నిర్వహించారు.

## గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలి



గూడూరు, నవంబర్ 6 ప్రభాతవార్త: గ్రామాల అభివృద్ధి దిశగా ప్రజాప్రతినిధులు, అధికారులు కృషిచేయాలని ఎంపీడీవో మధుసూధనరావు అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు స్థానికీకరణ సుస్థిరాభివృద్ధి లక్ష్యాలకు సంబంధించి శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎల్డీవో వాణి, నారాయణ, జలజాక్షి, గోపి, మోహన్, భాస్కర్ రెడ్డి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తిలో శవ పంచాయితీ

**-అత్త శవాన్ని ఇంటిలోకి అనుమతించని కోడలు -కుటుంబ కలహాలతో కోడలి దాష్టికం**

శ్రీకాళహస్తి, నవంబర్ 5 ప్రభాతవార్త : నైతిక విలువలు మంట కలసి పోతున్నాయి!. బంధాలు, అనుబంధాలకు విలువలేకుండా పోతుంది. మాన వత్వం మంట కలుస్తుంది.మనిషికి వృద్దాప్యం శాపంగా మారుతుంది. బతికినంత కాలం కుటుంబం కోసం తల్లడిల్లినా, కుటుంబం కోసం సర్వస్వం కోల్పో యినా కుటుంబ కలహాలు చివరి మజిలి సమయంలో కూడా శాపంగా మారుతుంది. ఇదే శ్రీకాళహస్తిలో గురువారం చోటు చేసుకుంది. శ్రీకాళ హస్తిలోని సినిమా వీధిలో సమాజానికి ఎందరో భావి భారత పౌరులను అందించిన ఓ ఉపాధ్యాయురాలు శవం రోడ్డుమీదనే నిలవాల్సి వచ్చింది. కారణం కష్టం చేసి సంపాదించిన ఆమె ఇంటిలోకి శవాన్ని రానివ్వకుండా కోడలు అడ్డుకుంది. చివరకు శ్రీకాళహస్తి సిఐ ప్రకాష్‌కుమార్ సూచనలతో ఎస్ఐ రవి, కానిస్టేబుల్ కన్నయ్యలు వెళ్ళి పంచాయితీ జరిపి ఎట్టకేలకు శవాన్ని ఇంటిలోపలకు అనుమతింపజేసారు. వివరాలు ఇలా ఉన్నాయి.శ్రీకాళహస్తిలోని సినిమావీధిలో నివాసముంటున్న రమాదేవి (77) సుమారు 40 సంవత్సరాల పాటు వివిధ పాఠశాలల్లో పని చేసారు. ప్రధానోపాధ్యాయు రాలుగా ఆమె ఉద్యోగ విరమణ చేసారు. ఆమె చనిపోయారు, శవాన్ని కుమారుడు సురేష్ ఇంటికి తీసుకొచ్చాడు. అయితే కోడలు శవాన్ని ఇంటిలోకి తీసుకురానివ్వకుండా తలుపులు వేసేసి శవాన్ని రోడ్డుమీదనే ఉండేటట్లు చేసింది. దాంతో కుమారుడు సురేష్,ఆయన కుమార్తె శవ పేటికను రోడ్డుమీదనే పెట్టుకొని రోదిస్తుండగా ఈ సమాచారం సమీపంలోని ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు చేరింది.



## శ్రీసిటీని సందర్శించిన ఏపీ ఎన్నికల కమిషనర్




శ్రీసిటీ (తడ), నవంబర్ 5ప్రభాతవార్త: రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నీలం సాహ్నీ, తన భర్త, కేంద్ర ఎలక్ట్రానిక్స్ ఐటీ మంత్రిత్వశాఖ మాజీ కార్యదర్శి అజయ్ ప్రకాశ్ సాహ్నీతో కలిసి గురువారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆమెకు సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలను వివరించారు. పరిశ్రమల అభివృద్ధి తో పాటు "మేక్ ఇన్ ఇండియా" కార్య క్రమానికి సహకారం, ఉపాధి సృష్టి మరియు ప్రాంతీయ ఆర్థిక అభివృద్ధిలో శ్రీసిటీ కీలక పాత్రను వివరించారు. గతంలో అజయ్ సాహ్నీ విలువైన సూచనలతో సాంకేతిక, తయారీ రంగాల్లో శ్రీసిటీకి నూతనోత్సాహం తెచ్చిందని డాక్టర్ సన్నారెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆమె చొరవతో ట్రిపుల్ శ్రీసిటీలో జ్ఞాన్ సర్కిల్ వెంచర్స్ స్థాపన, ఎలక్ట్రానిక్ మాన్యు ఫ్యాక్చరింగ్ క్లస్టర్ (ఈ ఎమ్ సి) అభివృద్ధి శ్రీసిటీ ప్రగతిలో మైలురాళ్లుగా పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా అతిథులు శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆల్స్టమ్, హంటర్ డగ్లస్ పరిశ్రమలను సందర్శించారు.

# గూడూరు డివిజన్

## 13న ఉచిత మెగా వైద్య శిబిరం

వెంకటగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త: ఈ నెల 13న ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు రోటరీ ఇన్నర్ వీల్ క్లబ్, మానవత స్వచ్ఛంద, సమరత సేవా సంస్థల ఆధ్వర్యంలో తిరుపతి అమర హాస్పిటల్ వారు ఉచిత వైద్యశిబిరం గవర్నమెంట్ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తారని సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. షుగర్, బి.పి, థైరాయిడ్, ఎముకల, అన్ని రకముల దీర్ఘకాలిక వ్యాధులకు ఉచిత వైద్యశిబిరంలో వైద్య నిపుణులు పరీక్షలు చేసి మందులు ఇస్తారని చెప్పారు.

## నూరు శాతం ఫలితాలు సాధించాలి

వాకాడు, నవంబర్ 6 ప్రభాతవార్త: ఎస్ఎస్‌సి ఫలితాల్లో నూరు శాతం రావాలని డిప్యూటీ డిఇఓ సంపత్ తెలిపారు. గురువారం మండల కేంద్రమైన వాకాడు ఎస్ఏఎల్‌సిఈఎఫ్ ప్రభుత్వ పాఠశాలను డిప్యూటీ డిఇఓ సంపత్ సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలోని ఉపాధ్యాయులు విద్యార్థు లకు అర్థమయ్యే రీతిలో క్షుణ్ణంగా పాఠాలు చెప్పాలన్నారు. ఆయన వెంట ఎంఈఓలు ఆనంద్, నసీం అలి, ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, ఉన్నారు.



## సూపర్ సిక్స్...అట్టర్ ప్లాప్ : ఎమ్మెల్సీ



వాకాడు, నవంబర్ 6 ప్రభాతవార్త: ఎన్నికలకు ముందు అజెండాలో సూపర్ సిక్స్ పథకాలు ప్రజలకు ఇస్తామన్ని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో అట్టర్ ప్లాప్ అయ్యాడని ఎమ్మెల్సీ మేరుగ మురళీధర్ అన్నారు. గురువారం వాకాడు మండలం కొండాపురం గ్రామంలోని మండల వైకాపా కన్వీనర్ సుధాకర్ నాయుడు ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడని, వ్యవస్థలన్నీ నిర్వీర్యం చేశాడని మేరీగా విమర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర వైకాపా నాయకులు కొడవలూరు దామోదర్ రెడ్డి, మండల వైకాపా కన్వీనర్ సుధాకర్ నాయుడు, సర్పంచ్ సిద్ధారెడ్డి మధుసూదన్ రెడ్డి, ఉప సర్పంచ్ పాపారెడ్డి రాజశేఖర్ రెడ్డి, వెంకటరత్నం, మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షులు వాటంగారి వెంకట రమణయ్య, నాయకులు నేదురుమల్లి హిమ కుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, కాంచన్, రత్నయ్య గౌడ్, లోక కళ్యాణ్, కోదండరెడ్డి, నెల్లూరు పెంచల్ రెడ్డి, స్థానిక నేతలు, తదితరులు ఉన్నారు.

## విద్యార్థికి ఆర్థిక సహాయం

గూడూరు రూరల్, నవంబర్ 6 ప్రభాతవార్త: రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా అనారోగ్య భారిన పడిన విద్యార్థికి ఆర్థిక సమాయం అందజేసారు. గూడూరు మండలంలోని అయ్యవారి పాళెం గ్రామానికి చెందిన ఎంట్రపాటి సందీప్ బి. ఫార్మసీ చదువుతున్నారు. దురదృష్టవశాత్తు అతనికి బ్రెయిన్‌లో ట్యూమర్‌తో బాధ పడుతున్నాడు. వైద్య ఖర్చుల కోసం రాజానేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌ని సంప్రదించగా, గురువారం బెంగుళూరు హాస్పిటల్‌లో మన ప్రతినిధి ద్వారా ముప్పైవేల రూపాయలు అందించారు.

## వడమాలపేట ఎంపీపీపై వీగిన అవిశ్వాసం

వడమాలపేట, నవంబరు 6 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా వడమాలపేట మండలం ఎంపీపీపై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. గురువారం వడమాలపేట ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన అవిశ్వాస తీర్మానం కోరం లేకపోవడంతో వీగిపోయినట్లు తిరుపతి ఆర్డీవో రామ్మోహన్ ప్రకటించారు. వైసీపీ పార్టీకి చెందిన వడమాలపేట ఎంపీపీ విజయలక్ష్మిపై అదే పార్టీకి చెందిన ఎంపీటీసీలు గత నెల 16న అవిశ్వాసం తీర్మానం కోసం తిరుపతి ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. దీనిపై గురువారం ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలో ఏడు మంది ఎంపీటీసీలు ఉండగా ఈ సమావేశానికి ఏఎం పురం, పత్తి పుత్తూరు ఎంపీటీసీలు పుష్పలత, ప్రతిమలు మాత్రమే హాజరయ్యారు. గంట సమయం ఇచ్చినా ఎవరూ హాజరు కాకపోవడంతో కోరం లేని కారణంగా అవిశ్వాస తీర్మానం వేగిపోయినట్లు ఆర్డీవో రామ్మోహన్ ప్రకటించారు. సమావేశంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఏవో హరినాథ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వంట యంత్రాల విరాళం

కాణిపాకం, నవంబర్ 6 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం నూతన అన్నదాన భవన్‌కు ఓ భక్తుడు గురువారం సుమారు 36 లక్షలు విలువగల కుకింగ్ యంత్రాలను విరాళంగా అందజేశారు. బెంగుళూరుకు చెందిన మురళీకృష్ణ, మహేశ్వరి వారి కుటుంబ సభ్యులు నూతన అన్నదాన భవన్‌కు సుమారు 36 లక్షలు విలువగల అధునాతన కుకింగ్ స్టీమింగ్, బాయిలర్ కిచెన్ ప్లాంట్‌లను విరాళంగా అందజేశారు. వారికి ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ,ఏఈఓ రవీంద్రబాబు, సూపరెడెంట్ వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.



## జాతీయ వాలీబాల్ జట్టుకు రహమాన్‌ఖాన్



బంగారుపాళ్యం, నవంబర్ 6 ప్రభాతవార్త: జాతీయ వాలీబాల్ క్రీడా జట్టుకు బంగారుపాళ్యంకు చెందిన పి.దావూద్‌ఖాన్ కుమారుడు పి.రహమాన్‌ఖాన్ ఎంపికయ్యాడు. 69 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 19 పోటీలకు రాష్ట్ర జట్టుకు రహమాన్‌ఖాన్ ఎంపికయ్యారు. ఇతను ఇటీవల పలమనేరు నందు జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో విశేష ఆట ప్రతిభను కనబరిచాడు. ఈ నెల 12న మధ్యప్రదేశ్‌లో జరుగనున్నాయి. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టు తరపున రహమాన్ ఖాన్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఎంపిక కావడం పట్ల జిల్లా వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి సుదర్శన్ నాయుడు, కోశాధికారి మురారి, మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు ఎంబి కృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

## కోతకు గురైన యాదకుంట చెరువుకట్ట

వి.కోట,నవంబర్ 6 ప్రభాతవార్త: మండలంలోని బైరుపల్లి పంచాయతీ యాదకుంట చెరువు కట్ట కోతకుగురవుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల తుఫాను సందర్భంగా చెరువు కట్ట మధ్యలో లీకేజ్‌కు గురై చెరువు కట్ట కుంగింది. ఈంతో అధికారులు తాత్కాలికంగా చెరువుమరువ వద్ద రోడ్డు కట్‌చేసి చెరువునీటిని దిగువకు విడిచారు. గండిపడిన చోట తాత్కాలిక మరమ్మతులు చేయించారు. ఇరిగేషన్ అధికారులు ట్రాక్టర్లతో మట్టిని రింగ్‌బండ్ కట్టవైపు వేశారు. బుధవారం నుంచి కురుస్తున్న వర్షాలకు మళ్లీ చెరువు కట్ట కోతకు గురైంది. విషయం తెలుసుకున్న రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ గజేంద్ర చెరువు కట్టను పరిశీలించారు. కాగా చెరువు కట్టను బలోపేతం చేయాలని, రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని గ్రామస్తులు పేర్కొన్నారు.



## ఎర్రచందనం స్మగ్లర్లు ఇద్దరికి ఐదేళ్ల జైలు, జరిమానా

తిరుపతి కార్పొరేషన్, నవంబర్ 6 ప్రభాతవార్త: ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరు స్మగ్లర్లు ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 6 లక్షలు జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడీజే కోర్టు న్యాయమూర్తి నరసింహ మూర్తి గురువారం తీర్పు నిచ్చారు. ఆర్ఎస్ఎఎస్టీఎఫ్ హెడ్ సుబ్బారాయుడు రూపొందించిన ప్రత్యేక కార్యాచరణ మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పీ పీ.శ్రీనివాస్ పర్యవేక్షణలో గతంలో నమోదై, కోర్టులో విచారణ దశలో ఉన్న కేసుల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అలుగూరి అమర నారాయణ ద్వారా పగడ్బందీగా సాక్ష్యాధారాలను నిరూపించి ముద్దాయిలకు శిక్షలు పడే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఆంధ్రప్రదేశ్ లోని శేషాచలం రిజర్వు ఫారెస్టులోని అతి విలువైన సహజ సంపద ఎర్రచందనం చెట్లను నరికేందుకు అడవిల్లోకి అక్రమంగా ప్రవేశించడానికి ప్రయత్నించే నేరస్తులకు ఇది ఒక హెచ్చరిక అవుతుందని టాస్క్ ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ పేర్కొన్నారు.

## కామధేను వాహనంపై ఆదిదంపతులు



చంద్రగిరి, నవంబర్ 6 ప్రభాతవార్త: కోరిన వరాలిచ్చే కామధేనువును వాహనంగా చేసుకుని ఆదిదంపతులు భక్తులను అనుగ్రహించారు. తొండవాడ గ్రామంలో స్వర్ణముఖీనదీతీరాన వెలసియున్న శ్రీ అగస్త్యేశ్వర స్వామి వారి ఆలయంలో కార్తీక మాసం ఉత్సవాలను ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి కామధేను వాహనంపై అధిష్టింపజేసి ఊరేగింపు నిర్వహించారు. దక్షిణామూర్తి స్వామి, దత్తాత్రేయ స్వామి వార్లకు అభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆదిదంపతులైన శివపార్వతుల కళ్యాణోత్సవాన్ని కన్నుల పండువగా జరిపించారు.